తరంగాలు
రిపోర్టర్లు కావలెను
అతి తక్కువ కాలంలో తెలుగు రాష్ట్రాల్లో అత్యంత ప్రజాదరణ పొందుతున్న 'తరంగాలు' జాతీయ దినపత్రిక నందు పనిచేయుటకు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లోని అన్ని జిల్లాలోని అన్ని మండలాల నుండి రిపోర్టర్లు కావలెను.
సంప్రదించండి...
94949 23460

ఎడిటర్ : రత్నం నాదరాజా
RNI . TELTEL / 2022 / 83463
జాతీయ దిన పత్రిక
# తరంగాలు
Tharangalu Daily News Paper
ప్రతి అక్షరం.... సామాన్యుడి అస్త్రం...

హైదరాబాద్
గురువారం
20 నవంబర్ 2025
సంపుటి 93
సంచిక 3
పేజీలు 8
వెల రూ. 5.00

Epaper : WWW.tharangalu.comEpa
Published From: Hyderabad,Circulated: Hyderabad,Nalgonda,Khammam,Rangareddy,sangareddy,Warangal,Kurnool,Kadapa,Amaravathi,Krishna

## వోకల్ ఫర్ లోకల్ మంత్రం

### పుట్టపర్తి వేదికగా ప్రధాని మోదీ కీలక పిలుపు

- పుట్టపర్తిలో సత్యసాయి శతజయంతి ఉత్సవాల్లో పాల్గొన్న ప్రధాని మోదీ
- రూ.100 స్మారక నాణెం, తపాలా బిళ్లను విడుదల చేసిన ప్రధాని
- సాయి బోధించిన ప్రేమ, సేవా మార్గం ప్రపంచానికి ఆదర్శమని వ్యాఖ్య



తరంగాలు, డెస్క్, నవంబర్ 19 : శ్రీ సత్యసాయి బాబా బోధించిన ప్రేమ, సేవా మార్గాలు ప్రపంచవ్యాప్తంగా కోట్లాది మందికి స్ఫూర్తినిస్తున్నాయని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అన్నారు. పుట్టపర్తిలో జరిగిన శ్రీ సత్యసాయి శతజ-యంతి ఉత్సవాల్లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఈ చారిత్రక సందర్భాన్ని పురస్కరించుకుని ముఖ్యమంత్రి చంద్రబాబుతో కలిసి రూ.100 స్మారక నాణేన్ని, ప్రత్యేక తపాలా బిళ్లను ఆవిష్కరించారు. హిల్ వ్యూ స్టేడియంలో ఏర్పాటు చేసిన సభలో మోదీ మాట్లాడుతూ.. సత్యసాయి బాబా జీవితం 'వసుధైవ కుటుంబం' అనే భారతీయ భావనకు నిలువుటద్దమని కొనియాడారు. "లవ్ ఆల్, సర్వ్ ఆల్" అనే ఆయన సందేశం అజరామరమని, బాబా భౌతికంగా మన మధ్య లేకపోయినా ఆయన స్థాపించిన సంస్థలు మానవ సేవే మాధవ సేవ స్ఫూర్తితో సేవలను కొనసాగిస్తున్నాయని ప్రశంసించారు. భుజ్ భూకంపం వంటి విపత్తుల సమయంలో సత్యసాయి సేవాదళ్ అందించిన సేవలను ఆయన గుర్తు చేసుకున్నారు.

ఈ కార్యక్రమంలో భాగంగా శ్రీ సత్యసాయి ట్రస్టు ఆధ్వర్యంలో 100 గిర్ జాతి ఆవులను పేద కుటుంబాలకు ప్రధాని తన చేతుల మీదుగా అందజేశారు. ప్రభుత్వం అమలు చేస్తున్న 'రాష్ట్రీయ గోకుల్ మిషన్' ద్వారా పేదల జీవితాల్లో మార్పు తె-స్తున్నామని వివరించారు.

దేశం 'వికసిత్ భారత్' లక్ష్యంతో ముందుకు సాగుతోందని, దీనికి ప్రజా భాగస్వామ్యం అత్యంత కీలకమని ప్రధాని మోదీ పిలుపునిచ్చారు. ప్రతి ఒక్కరూ 'వోకల్ ఫర్ లోకల్' మంత్రాన్ని స్వీకరించి, స్థానిక ఉత్పత్తులను ప్రోత్సహించాలని కోరారు. తద్వారా స్థానిక ఆర్థిక వ్యవస్థలు బలపడి 'ఆత్మనిర్భర్ భారత్' సాకారమవుతుందని పేర్కొన్నారు. సత్యసాయి బాబా ప్రేరణతో కరుణ, శాంతి మార్గంలో పయనిస్తూ దేశాభివృద్ధికి పాటుపడాలని సూచించారు.

తెలంగాణలో

## పంచాయతీ ఎన్నికలకు కసరత్తు

### ప్రారంభించిన ఎన్నికల సంఘం




- ఓటరు జాబితా సవరణకు షెడ్యూలును ప్రకటించిన ఎన్నికల సంఘం
- ఈ నెల 23 వరకు గ్రామాల్లో ఓటర్ల జాబితా సవరణ
- జిల్లా పంచాయతీ అధికారులకు ఎన్నికల కమిషనర్ ఆదేశాలు

తరంగాలు, డెస్క్, నవంబర్ 19 : తెలంగాణ రాష్ట్రంలో పంచాయతీ ఎన్నికల నిర్వహణకు రాష్ట్ర ఎన్నికల సంఘం కసరత్తు ప్రారంభించింది. ఇందులో భాగంగా పంచాయతీల్లో ఓటరు జాబితా సవ-రణకు షెడ్యూల్‌ను ప్రకటించింది. రేపటి నుంచి ఈ నెల 23 వరకు గ్రామాల్లో ఓటర్ల జాబితాలను సవరించాలని నిర్ణయించింది.

ఈ నెల 20న ఓటర్ల దరఖాస్తులు, అభ్యంతరాల స్వీకరణ, తప్పుల సవరణ, 21న ఓటర్ల దరఖాస్తులు, అభ్యంతరాల పరిష్కారం, 23న తుది ఓటర్ల జాబితా, పోలింగ్ కేంద్రాల ప్రచురణ ఉంటుందని ఎన్నికల సంఘం తన ఉత్తర్వుల్లో పేర్కొంది. ఈ మేరకు జిల్లా పంచాయతీ అధికారులకు రాష్ట్ర ఎన్నికల కమిషనర్ ఆదేశాలు జారీ చేశారు.

రాష్ట్రంలో డిసెంబరు రెండో వారంలో పంచాయతీ ఎన్నికలకు షెడ్యూలు వెలువడే అవకాశం ఉంది. అదే నెలాఖరులోగా పంచాయతీ ఎన్నికలు పూర్తి చేసే అవకాశం ఉంది. సోమవారం మంత్రి మండలిలో స్థానిక సంస్థల ఎన్నికలపై విస్తృతంగా చర్చ జరిగింది. డిసెంబర్ 1 నుంచి 9 వరకు ప్రజాపాలన వారోత్సవాల అనంతరం ఎన్నికలు నిర్వహించాలని మంత్రిమండలి నిర్ణయించిన నేపథ్యంలో పంచాయతీరాజ్ శాఖ, ఎన్నికల సంఘం ఈ మేరకు దృష్టి సారించాయి.

## అయ్యప్పస్వాములకు కేరళలో అవమానం

### - చంద్రబాబు, రేవంత్ రెడ్డికి రాజాసింగ్ కీలక విజ్ఞప్తి

- తెలుగు రాష్ట్రాల స్వాములకు ప్రతి సంవత్సరం ఇబ్బంది ఎదురవుతోందన్న రాజాసింగ్
- గోదావరి జిల్లాల స్వాములు అడ్రస్ అడిగితే కేరళ పోలీసులు అసభ్యకరంగా ప్రవర్తించారని వెల్లడి
- ఇలాంటి వాటిని నివారించేందుకు అక్కడ ప్రతినిధులు ఉండాలన్న రాజాసింగ్
- అసభ్యకరంగా ప్రవర్తించిన కేరళ పోలీసులపై చర్యలు తీసుకునేలా చంద్రబాబు జోక్యం చేసుకోవాలని విజ్ఞప్తి



తరంగాలు, డెస్క్, నవంబర్ 19 : తెలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రులకు గోషామహల్ ఎమ్మెల్యే రాజాసింగ్ అయ్యప్ప స్వాములకు సంబంధించి ఒక విజ్ఞప్తి చేశారు. అయ్యప్ప మాల వేసుకుని వెళ్లిన తెలుగువారికి ప్రతి సంవత్సరం ఏదో రకంగా ఇబ్బందులు ఎదురవుతున్నాయని, వాటి విషయంలో చొరవ తీసుకోవాలని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు, తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి రాజాసింగ్ విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు ఆయన ఒక వీడియోను విడుదల చేశారు.

మిగతా 2 లో..

## కవిత ప్రశ్నకు సమాధానం చెప్పాలి

### - మంత్రి తుమ్మల వ్యాఖ్య

- ఇష్టారీతిన కామెంట్ చేస్తే సస్పెండ్ చేస్తామన్న రామచందర్ రావు
- బీజేపీపై ఎవరు పోస్టులు పెట్టినా కౌంటర్ ఇవ్వాలని సూచన
- బీజేపీపై తప్పుడు పోస్టులు పెడితే కేసులు పెడతామని హెచ్చరిక



తరంగాలు, డెస్క్, నవంబర్ 19 : మీ ఇంటి ఆడబిడ్డ కవిత అడిగే ప్రశ్నలకు ముందుగా బీఆర్ఎస్ నాయకులు సమాధానం చెప్పాలని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. బీఆర్ఎస్ పెద్దలు తమ ఇంట్లో కుంపటిని రాష్ట్రమంతటా పెట్టవద్దని ఆయన వ్యాఖ్యానించారు. జాగృతి జనం బాట కార్యక్రమంలో భాగంగా ఖమ్మం జిల్లాలో పర్యటించిన కవిత ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. తుమ్మల నాగేశ్వరరావు వంటి సీనియర్ నాయకులను వదులుకోవడం కేసీఆర్ చేసిన తప్పని ఆమె అన్నారు. ఆ ప్రభావం వల్లే బీఆర్ఎస్ ఓడిపోయిందని వ్యాఖ్యానించారు. ఆమె వ్యాఖ్యల నేపథ్యంలో తుమ్మల పైవిధంగా స్పందించారు. ఆయన ఇంకా మాట్లాడుతూ, రైతులను రెచ్చగొట్టి ప్రభుత్వాన్ని బద్నాం చేయాలని బీఆర్ఎస్ కుట్రలు చేస్తోందని మండిపడ్డారు. ప్రత్తి కొనుగోలు చేయాలని ఒకవైపు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ చెబుతున్నారని, మరోవైపు సీసీఐ నిబంధనలతో రైతులను ఇబ్బంది పెడుతోందని విమర్శించారు. దేశంలో ఎక్కడా లేనివిధంగా ఎంఎస్‌పీకి పంటలు కొనే రాష్ట్రం తెలంగాణ అని ఆయన అన్నారు.

## తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత అరెస్టు

- సింగరేణి కార్మికుల సమస్యలు పరిష్కరించాలంటూ నిరసన
- సింగరేణి భవన్ ఎదుట ఆందోళనకు దిగిన కవిత
- కవితను అరెస్టు చేసి నాంపల్లి పోలీస్ స్టేషన్‌కు తరలించిన పోలీసులు



తరంగాలు, డెస్క్, నవంబర్ 19 : తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవితను పోలీసులు అరెస్టు చేశారు. హైదరాబాద్ నగరంలోని నాంపల్లిలో గల సింగరేణి భవన్ వద్ద ఆందోళనకు దిగిన కవితను అదుపులోకి తీసుకున్నారు. సింగరేణి కార్మికుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ కవిత సింగరేణి భవన్ ఎదుట బైఠాయించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, డిపెండెంట్ ఉద్యోగులను పునరుద్ధరించాలని ఆమె అన్నారు. సింగరేణి సమస్యలను పరిష్కరించలేని అసమర్థ ప్రభుత్వమని ఆమె విమర్శించారు. కార్మికుల కోసం మెడికల్ బోర్డు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఈ క్రమంలో కవితతో పాటు బైఠాయించిన వారిని పోలీసులు అదుపులోకి తీసుకుని నాంపల్లి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. సింగరేణి భవన్‌ను కవిత ముట్టడిస్తుందన్న సమాచారంతో పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు.

## పార్టీ కార్యకర్తలకు బీజేపీ అధ్యక్షుడు రామచందర్ రావు హెచ్చరిక

- ఇష్టారీతిన కామెంట్ చేస్తే సస్పెండ్ చేస్తామన్న రామచందర్ రావు
- బీజేపీపై ఎవరు పోస్టులు పెట్టినా కౌంటర్ ఇవ్వాలని సూచన
- బీజేపీపై తప్పుడు పోస్టులు పెడితే కేసులు పెడతామని హెచ్చరిక



తరంగాలు, డెస్క్, నవంబర్ 19: పార్టీ కార్యకర్తలు ఇకపై ఇష్టారీతిన వ్యాఖ్యలు చేస్తే సస్పెండ్ చేస్తామని తెలంగాణ బీజేపీ అధ్యక్షుడు రామచందర్ రావు హెచ్చరించారు. హైదరాబాద్ నగరంలోని పార్టీ ప్రధాన కార్యాలయంలో లీగల్ సెల్ ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ, సామాజిక మాధ్యమాల్లో బీజేపీపై ఇతర పార్టీలు ఎవరు పోస్టులు పెట్టినా ప్రతి కార్యకర్త కౌంటర్ ఇవ్వాలని పిలుపునిచ్చారు.

కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు నకిలీ ఖాతాలతో బీజేపీ మీద పోస్టులు పెడుతున్నాయని ఆయన అన్నారు. తమపై తప్పుడు వార్త రాసిన పత్రికపై రూ. 5 కోట్ల పరువు నష్టం దావా వేశామని అన్నారు. బీజేపీ నాయకులు, కార్యకర్తల మీద ఇష్టారీతిన పోస్టులు పెడుతున్నారని ధ్వజమ-ెత్తారు. బీజేపీపై తప్పుడు పోస్టులు పెడితే కేసులు పెడతామని హెచ్చరించారు. బీజేపీ చిల్లర రాజకీయాలకు భయపడదని ఆయన అన్నారు.

# అయ్యప్పస్వాములకు కేరళలో అవమానం

## - చంద్రబాబు, రేవంత్ రెడ్డికి రాజాసింగ్ కీలక విజ్ఞప్తి

మొదటిపేజీ తరువాయి..

తరంగాలు, డెస్క్, నవంబర్ 19 : ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలతో పాటు ఇతర రాష్ట్రాల నుంచి అయ్యప్ప స్వామి దర్శనానికి వెళ్లిన వారికి కేరళలో ఇబ్బందులు ఎదురవుతున్నాయని ఆయన అన్నారు. ఆంధ్రప్రదేశ్‌లోని గోదావరి జిల్లాకు చెందిన అయ్యప్ప స్వాములు సమూహంగా వెళ్లగా, వారికి దారి తెలియక పోలీసులను అడ్రస్ అడిగితే అసభ్యకరంగా సమాధానం చెప్పారని ఆవేదన వ్యక్తం చేశారు. కేరళ పోలీసులు, ప్రభుత్వం నుంచి మన స్వాముల ప్రతి సంవత్సరం ఈ తరహా అవమానాలను ఎదుర్కొంటున్నారని అన్నారు.

అందుకే, తెలుగు స్వాములకు ఇబ్బందులు తలెత్తకుండా తెలుగు రాష్ట్రాల ప్రతినిధి ఉండాలని ఆయన విజ్ఞప్తి చేశారు. తెలంగాణ నుంచి తిరుపతికి వెళితే ఇక్కడికి చెందిన కోఆర్డినేటర్ ఉంటారని, ఈ తరహా సదుపాయం కేరళలోనూ ఏర్పాటు చేయాలని చంద్రబాబు, రేవంత్ రెడ్డికి విజ్ఞప్తి చేశారు. గోదావరి జిల్లా భక్తుల పట్ల అసభ్యంగా ప్రవర్తించిన కేరళ పోలీసులపై చర్యలు తీసుకునేలా చంద్రబాబు అక్కడి వారితో మాట్లాడాలని విజ్ఞప్తి చేశారు. అవసరమైతే ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి, పోలీసులతో మాట్లాడాలని రాజాసింగ్ అన్నారు.



# షేక్ హసీనా అప్పగింతకు భారత్ విముఖత... బంగ్లాదేశ్ కీలక నిర్ణయం

తరంగాలు, డెస్క్, నవంబర్ 19: బంగ్లాదేశ్ మాజీ ప్రధాని షేక్ హసీనాను అప్పగించాలని బంగ్లాదేశ్ ఇంటర్‌పోల్‌ను ఆశ్రయించాలని భావిస్తోంది. మానవత్వం మరిచి తీవ్ర నేరాలకు పాల్పడ్డారన్న కేసులో షేక్ హసీనాకు బంగ్లాదేశ్ అంతర్జాతీయ క్రైమ్ ట్రైబ్యునల్ మరణశిక్ష విధించిన విషయం విదితమే. ఈ నేపథ్యంలో ఆమెను తమకు అప్పగించాలని యూనస్ ప్రభుత్వం కోరుతున్నప్పటికీ భారత్ విముఖత చూపిస్తోంది. ఈ మేరకు బంగ్లాదేశ్ విదేశాంగ శాఖ చర్యలు తీసుకుంటున్నట్లు వార్తలు వస్తున్నాయి. గత సంవత్సరం దేశం విడిచిన షేక్ హసీనా, మాజీ హోంమంత్రి అసదుజ్జమాన్ ఖాన్‌లపై రెడ్ కార్నర్ నోటీసులు జారీ చేయాల్సిందిగా ఇంటర్‌పోల్‌ను అభ్యర్థించడానికి బంగ్లాదేశ్ ప్రాసిక్యూటర్ గాజీ తమీమ్ సన్నాహాలు చేస్తున్నారని బంగ్లాదేశ్ దినపత్రిక 'ది ఫైనాన్షియల్ ఎక్స్‌ప్రెస్' నివేదించింది. పరారీలో ఉన్న ఇద్దరు నిందితులపై రెడ్ నోటీసులు జారీ చేయాలని కోరుతూ ఇంటర్నేషనల్ క్రైమ్స్ ట్రైబ్యునల్



ఇదివరకే ఇంటర్‌పోల్‌కు అరెస్టు వారెంటుతో పాటు దరఖాస్తు సమర్పించినట్లు బంగ్లాదేశ్ మీడియాలో వార్తలు వచ్చాయి. గత సంవత్సరం జరిగిన రిజర్వేషన్ల ఆందోళనలు హింసాత్మకంగా మారిన నేపథ్యంలో షేక్ హసీనా బంగ్లాదేశ్ నుంచి వచ్చి ఢిల్లీలో గుర్తు తెలియని ప్రాంతంలో ఉంటున్నట్లు తెలుస్తోంది.

# ఈసీపై ఆరోపణలు.. రాహుల్ గాంధీకి 272 మంది ప్రముఖుల లేఖ

తరంగాలు, డెస్క్, నవంబర్ 19 : భారత ప్రజాస్వామ్యం, దాని మూల స్తంభాలపై దాడి జరుగుతోందంటూ కాంగ్రెస్ పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీకి 272 మంది ప్రముఖులు లేఖ రాశారు. ఓట్ల చోరీ జరుగుతోందని కేంద్ర ఎన్నికల సంఘంపై రాహుల్ గాంధీ తీవ్ర ఆరోపణలు చేస్తున్న నేపథ్యంలో ఆయన విధానాలను విమర్శిస్తూ ఈ లేఖ వెలువడింది. ఈ లేఖపై 16 మంది రిటైర్డ్ న్యాయమూర్తులు, 123 మంది మాజీ అధికారులు, 133 మంది మాజీ సైనికాధికారులు, 14 మంది మాజీ రాయబారులు సంతకాలు చేశారు. ప్రజాస్వామ్యం, దాని పునాదులపై దాడి జరుగుతోందని వారు ఆందోళన వ్యక్తం చేశారు. సొంత రాజకీయ ప్రయోజనాల కోసం నిరాధార ఆరోపణలు చేస్తున్నారని ఆ లేఖలో పేర్కొన్నారు. మహారాష్ట్ర, హర్యానా అసెంబ్లీ ఎన్నికల్లో ఓట్ల చోరీ జరిగిందని రాహుల్ గాంధీ ఆరోపించారని గుర్తు చేశారు. ఆధారాలు లేని ఆరోపణలు చేయడంతో పాటు ప్రభుత్వ ఉద్యోగులను బెదిరిస్తున్నారని వారు ఆరోపించారు. అయితే, ఈ విషయంపై రాహుల్ గాంధీపై ఎలాంటి అధికారిక ఫిర్యాదు నమోదు కాలేదని తెలిపారు. ప్రతిపక్ష నాయకుడు ఎన్నికల కమిషన్‌పై పదేపదే దాడి చేస్తూ, ఓట్ల చోరీకి సంబంధించి తన వద్ద అణుబాంబు లాంటి ఆధారాలు ఉన్నాయని చెబుతూ నమ్మశక్యం కాని, అభ్యంతరకర భాషను ఉపయోగిస్తున్నారని వారు విమర్శించారు. ఈసీలో కింది స్థాయి నుంచి ఉన్నత స్థాయి వరకు ఎవరినీ వదిలిపెట్టబోమని బెదిరింపులకు పాల్పడటం సరికాదని వారు ఆ లేఖలో పేర్కొన్నారు. ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్)ను విమర్శించడాన్ని



వారు ఖండించారు. ఎస్ఐఆర్ పై ఈసీ ఇప్పటికే వివరణ ఇచ్చిందని, సుప్రీంకోర్టు కూడా దీనిపై మార్గదర్శకాలు జారీ చేసిందని వారు గుర్తు చేశారు. ఈ ప్రక్రియలో అనర్హులను తొలగించి, కొత్తగా అర్హత కలిగిన ఓటర్లను చేర్చడం మాత్రమే జరుగుతుందని వారు స్పష్టం చేశారు. ఎన్నికల ఫలితాలు అనుకూలంగా వస్తే రాహుల్ గాంధీ ఈసీపై ఆరోపణలు చేయడం లేదని, వ్యతిరేకంగా వస్తే మాత్రం ఈసీని విలన్‌గా చిత్రీకరిస్తున్నారని వారు ఆగ్రహం వ్యక్తం చేశారు. రాజకీయ నాయకులు రాజ్యాంగ ప్రక్రియను గౌరవించాలని, నిరాధారమైన ఆరోపణలు చేయడం మానుకుని, విధానపరమైన ప్రకటనలతో పోటీ పడాలని వారు ఆ లేఖలో సూచించారు.

# బెంగళూరులో పట్టపగలే భారీ దోపిడీ..

## - ఆర్బీఐ అధికారులమంటూ రూ.7.11 కోట్లు లూటీ!

తరంగాలు, డెస్క్, నవంబర్ 19 : కర్ణాటక రాజధాని బెంగళూరులో పట్టపగలే సినీ ఫక్కీలో భారీ దోపిడీ జరిగింది. ఏటీఎంలలో నింపేందుకు తరలిస్తున్న రూ.7.11 కోట్ల నగదుతో ఉన్న వాహనాన్ని దుండగులు ఎత్తుకెళ్లారు. ఈ ఘటనతో అప్రమత్తమైన బెంగళూరు నగర పోలీస్ కమిషనర్ సీమంత్ కుమార్ సింగ్ నగరం మొత్తం హై అలర్ట్ ప్రకటించారు. నిందితులు తప్పించుకోకుండా నగర సరిహద్దుల్లో బారికేడ్లు ఏర్పాటు చేసి వాహన తనిఖీలను ముమ్మరం చేశారు. సౌత్ ఎండ్ సర్కిల్ వద్ద సీఎంఎస్ సిబ్బంది ఏటీఎంలో నగదు నింపేందుకు సిద్ధమవుతుండగా ఈ ఘటన చోటుచేసుకుంది. ఇన్నోవా కారులో వచ్చిన 7-8 మంది దుండగులు, తాము ఆర్బీఐ అధికారులమంటూ సిబ్బందిని బెదిరించారు. వాహనంలోని గన్‌మన్లు, ఇతర సిబ్బందిని కిందకు దించి, డ్రైవర్‌ను మాత్రం వాహనంలోనే ఉంచి డెయిరీ సర్కిల్ వైపు తీసుకెళ్లారు. డెయిరీ సర్కిల్ ఫ్లైఓవర్‌పై వాహనాన్ని ఆపి, అందులోని నగదును తమ ఇన్నోవా కారులోకి మార్చుకొని అక్కడి నుంచి పరారయ్యారు. దోపిడీకి ఉపయోగించిన ఇన్నోవా కారుకు నకిలీ నంబర్ ప్లేట్ KA 03 NC 8052 ఉపయోగించినట్లు పోలీసులు గుర్తించారు. ఈ నంబర్ వాస్తవానికి కల్యాణ్ నగర్‌కు చెందిన స్విఫ్ట్ కారుదని తేలింది. ఈ ఘటనపై పోలీసులు పలు కోణాల్లో దర్యాప్తు చేస్తున్నారు. సంఘటన జరిగిన 45 నిమిషాల నుంచి గంట ఆలస్యంగా సిబ్బంది సమాచారం ఇవ్వడం, గన్‌మన్లు తమ ఆయుధాలను ఎందుకు ఉపయోగించలేదనే అంశాలపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. సీఎంఎస్ సిబ్బంది ప్రమేయం ఉండొచ్చనే కోణంలోనూ విచారిస్తున్నారు. డ్రైవర్, ఇద్దరు గన్‌మన్లు సహా నలుగురు సిబ్బందిని సిద్దాపుర పోలీస్ స్టేషన్‌లో విచారిస్తున్నారు. "నిందితులను వీలైనంత త్వరగా అరెస్టు చేస్తాం" అని కమిషనర్ సీమంత్ కుమార్ సింగ్ తెలిపారు. పక్కా ప్రణాళికతోనే సీసీటీవీ కెమెరాలు లేని, రద్దీగా ఉండే డెయిరీ సర్కిల్ ఫ్లైఓవర్‌ను దోపిడీకి ఎంచుకున్నట్లు పోలీసులు భావిస్తున్నారు.

# జోహన్నెస్ బర్గ్‌లో జీ20 సదస్సు

## - దక్షిణాఫ్రికాకు వెళ్లనున్న ప్రధాని మోదీ



తరంగాలు, డెస్క్, నవంబర్ 19: ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నవంబర్ 21 నుంచి దక్షిణాఫ్రికాలో పర్యటించనున్నారు. ఈ నెల 22, 23 తేదీల్లో జోహన్నెస్‌బర్గ్‌లో జరగనున్న 20వ జీ20 దేశాల అధినేతలు సదస్సులో ఆయన పాల్గొంటారు. ఈ మేరకు విదేశాంగ మంత్రిత్వ శాఖ బుధవారం ఒక ప్రకటన విడుదల చేసింది. "ఇది గ్లోబల్ సౌత్‌లో వరుసగా జరుగుతున్న నాలుగవ జీ20 శిఖరాగ్ర సమావేశం. ఈ సదస్సులో, ప్రధానమంత్రి జీ20 ఎజెండాపై భారతదేశం యొక్క దృక్పథాలను తెలియజేస్తారు. సదస్సులోని మూడు సెషన్లలో ప్రధానమంత్రి ప్రసంగిస్తారు" అని విదేశాంగ శాఖ తన ప్రకటనలో పేర్కొంది.

సదస్సులోని మూడు సెషన్లలో ప్రధాని సమగ్ర, స్థిరమైన ఆర్థికాభివృద్ధి, వాణిజ్యం, వాతావరణ మార్పులు, ఆహార వ్యవస్థలు, అరుదైన ఖనిజాలు, కృత్రిమ మేధస్సు అంశాలపై మాట్లాడనున్నారు. జీ20 శిఖరాగ్ర సమావేశం సందర్భంగా జోహన్నెస్‌బర్గ్‌లో వివిధ దేశాధినేతలతో ద్వైపాక్షిక సమావేశాలు నిర్వహిస్తారని వెల్లడించింది. అదే విధంగా ఇండియా-బ్రెజిల్-దక్షిణాఫ్రికా నేతల సమావేశంలోనూ పాల్గొననున్నట్లు తెలిపింది.

జీ20 సదస్సుకు అమెరికా నుంచి ఎవరూ హాజరు కాబోరని ఆ దేశ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఇటీవల ప్రకటించారు. దక్షిణాఫ్రికాలో మైనారిటీలైన శ్వేతజాతి రైతులను చూస్తున్న తీరుపై ఆయన తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. అంతకుముందు మయామిలో చేసిన ఒక ప్రసంగంలో దక్షిణాఫ్రికాను జీ20 నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు.

# మూసీ ప్రక్షాళన, మెట్రో విస్తరణ..

## - హైదరాబాద్‌కు కేంద్ర మంత్రి శుభవార్త

తరంగాలు, డెస్క్, నవంబర్ 19: భాగ్యనగర మెట్రో రైల్ విస్తరణ ప్రాజెక్టును పూర్తి చేసేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చెరిసగం ఖర్చును భరించుకోవాలని యోచిస్తున్నట్టు కేంద్ర గృహ, పట్టణ వ్యవహారాల శాఖ మంత్రి మనోహర్ లాల్ ఖట్టర్ తెలిపారు. హైదరాబాద్‌లో అదనంగా 160 కిలోమీటర్ల మేర మెట్రో లైన్లను నిర్మించేందుకు తెలంగాణ ప్రభుత్వం నుంచి ప్రతిపాదనలు అందినట్లు ఆయన వెల్లడించారు.

మంగళవారం హైదరాబాద్‌లో జరిగిన దక్షిణాది రాష్ట్రాల పట్టణాభివృద్ధి మంత్రులు, అధికారుల ప్రాంతీయ సదస్సులో ఆయన మాట్లాడారు. ఈ సమావేశానికి తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. అనంతరం తెలంగాణ ఐటీ మంత్రి శ్రీధర్ బాబు, ఏపీ పురపాలక శాఖ మంత్రి నారాయణతో కలిసి ఖట్టర్ విలేకరులతో మాట్లాడారు. "మెట్రో విస్తరణ ప్రతిపాదనల సాధ్యాసాధ్యాలను పరిశీలిస్తున్నాం. ఏ లైన్లకు ఆమోదం తెలపాలనే దానిపై మార్చి నాటికి కేంద్రం నిర్ణయం తీసుకుంటుంది" అని ఖట్టర్ స్పష్టం చేశారు.

ప్రస్తుతం ఎల్ & టీ భాగస్వామ్యంతో ఉన్న హైదరాబాద్ మెట్రో ప్రాజెక్టును రాష్ట్ర ప్రభుత్వం టేకోవర్ చేసేందుకు ప్రాథమికంగా అంగీకారానికి వచ్చిన నేపథ్యంలో, కేంద్ర ప్రభుత్వ భాగస్వామ్యంతో మెట్రోను విస్తరించడానికి తెలంగాణ ప్రభుత్వం సిద్ధంగా ఉందని ఆయన అన్నారు.

### విశాఖ, విజయవాడ మెట్రోలు, అమరావతి అభివృద్ధి

ఆంధ్రప్రదేశ్‌లోని విశాఖపట్నం, విజయవాడ నగరాల్లో కూడా మెట్రో ప్రాజెక్టులకు డిమాండ్ ఉందని మనోహర్ లాల్ ఖట్టర్ తెలిపారు. ఆ ప్రతిపాదనలను కూడా పరిశీలించి తగిన నిర్ణయం తీసుకుంటామన్నారు. అమరావతిని



ప్రధాన నగరంగా అభివృద్ధి చేసే ఆలోచన కూడా కేంద్రానికి ఉందని, ప్రస్తుత ప్రణాళికల ఆధారంగా అవసరమైన నిధులు అందిస్తామని హామీ ఇచ్చారు.

### మూసీ ప్రక్షాళనకు కేంద్రం చేయూత

మూసీ రివర్‌ఫ్రంట్ అభివృద్ధికి తెలంగాణ ప్రభుత్వం సమర్పించిన ప్రతిపాదనలపైనా ఖట్టర్ మాట్లాడారు. "మొదటి దశలో 9 కిలోమీటర్ల మేర రివర్‌ఫ్రంట్ అభివృద్ధి చేస్తాం. నీటి నాణ్యతను పర్యవేక్షించేందుకు ప్రతి 5 కిలోమీటర్లకు ఒక మురుగునీటి శుద్ధి కేంద్రం (ఎస్‌టీపీ) ఏర్పాటుకు ఆమోదం తెలిపాం. మూసీ ప్రక్షాళనకు అమృత్ పథకం, అర్బన్ ఛాలెంజ్ ఫండ్ (యూసీఎఫ్) ద్వారా నిధులు సమకూరుస్తాం" అని వివరించారు. ఇదే సమయంలో, పట్టణాభివృద్ధికి కేటాయించిన నిధులను రాష్ట్రాలు సక్రమంగా ఎందుకు వినియోగించుకోవడం లేదని అధికారులను ప్రశ్నించారు.

ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ, మూసీ నది నీటి నాణ్యతను పరీక్షించేందుకు ఒక టెస్టింగ్ ల్యాబొరేటరీకి ఆమోదం లభించిందని, హైదరాబాద్ మెట్రోకు 50:50 వాటా పద్ధతిపై చర్చలు జరిగాయని ధ్రువీకరించారు.

# ఘనంగా ఇందిరా గాంధీ జయంతి వేడుకలు



కేసముద్రం, మహబూబాబాద్, ప్రతినిధి, నవంబర్. 19, తరంగాలు : బుధవారం కేసముద్రం పట్టణంలో భారత తొలి మహిళ ప్రధాని స్వర్గీయ ఇందిరా గాంధీ జయంతి సందర్భంగా మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు అల్లం నాగేశ్వరరావు గారి ఆదేశాల మేరకు గాంధీ సెంటర్లో పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు రావుల మురళి ఇందిరాగాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ డైరెక్టర్లు ఎండి అయుఖ్ ఖాన్, యాదగిరి, మైనార్టీ సెల్ పట్టణ అధ్యక్షులు ఎండి రషీద్ ఖాన్, యూత్ కాంగ్రెస్ నాయకులు ముజ్జు షేక్, పిల్లి రమేష్, మాజీ ఉపసర్పంచ్ ఎండి రఫీ, రాజేష్, కమల్, నూరుద్దీన్, రఫీ, శ్రీను, జెలేందర్, షబ్బీర్ తదితరులు పాల్గొన్నారు.

# గ్రంథాలయాలను పట్టించుకోని కాంగ్రెస్ ప్రభుత్వం - రాణా ప్రతాపరెడ్డి మండిపాటు





నర్సంపేట నవంబర్ 19 తరంగాలు : రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం గ్రంథాలయాలను పట్టించుకోకుండా నిర్వీర్యం చేస్తుందని బిజెపి వరంగల్ జిల్లా ప్రధాన కార్యదర్శి గోగుల రాణా ప్రతాప్ రెడ్డి మండిపడ్డారు బుధవారం పట్టణంలోని గ్రంథాలయాన్ని పార్టీ నాయకులతో కలిసి సందర్శించారు ఈ సందర్భంగా గ్రంథాలయంలో పోటీ పరీక్షలకు సన్నాద్ధం అవుతున్న అభ్యర్థులకు కల్పిస్తున్న మౌలిక సదుపాయాలను అడిగి తెలుసుకున్నారు అనంతరం ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి రెండు సంవత్సరాలు కావస్తున్నా కనీసం జిల్లా గ్రంథాలయ చైర్మన్ మరియు డైరెక్టర్లను నియమించకుండా పట్టించుకోవడం లేదని పోటీ పరీక్షలకు సిద్ధం అవుతున్న యువతి యువకులకు సదుపాయాలు సరిగా లేక అనేక ఇబ్బందులకు గురవుతున్నారని వెంటనే స్థానిక ఎమ్మెల్యే ఈ విషయంపై దృష్టి సారించి గ్రంథాలయ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు గ్రంథాలయానికి వచ్చిన వారికి కనీసం కూర్చోవడానికి కుర్చీ కూడా లేదని ఆరు బయట చెట్ల కింద కూర్చొని చదువుకునే దుస్థితి నెలకొందన్నారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం దృష్టి సారించి పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న అభ్యర్థులకు సరిపడా సదుపాయాలు కల్పించాలన్నారు లేనిచో రానున్న రోజుల్లో బిజెపి తరఫున ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు ఈ కార్యక్రమంలో బిజెపి నియోజకవర్గ మండల స్థాయి నాయకులు పాల్గొన్నారు.

# జిల్లా కలెక్టర్ ను అభినందించిన జిల్లా ఇంచార్జి మంత్రి పొంగులేటి

- జల సంరక్షణ కేటగిరి-2 లో అవార్డు స్వీకరించిన కలెక్టర్



వరంగల్ ప్రతినిధి, 19 నవంబర్, తరంగాలు : దక్షిణ భారతదేశంలో జల సంరక్షణ కేటగిరి- 2 లో వరంగల్ జిల్లా కు మొదటి స్థానం దక్కిన నేపథ్యం లో డిల్లీ లో నిర్వహించిన కార్యక్రమం లో అవార్డు తో పాటు రూ. కోటి దక్కించుకొని అవార్డు స్వీకరించిన తరుణం లో బుధవారం హైదరాబాద్ లో ఉమ్మడి జిల్లా ఇంచార్జి మంత్రి , రాష్ట్ర రెవెన్యూ, హౌజింగ్, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డిని జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మంత్రి జిల్లా కలెక్టర్ ను అభినందించి శుభాకాంక్షలు తెలియజేసి మాట్లాడుతూ జిల్లాలో జల సంరక్షణ చర్యలను విజయవంతం గా చేపట్టి రాష్ట్రానికి ప్రతిష్ఠ తెచ్చారని ప్రశంసించారు.జల వనరుల పరిరక్షణకు మరింత కృషి చేస్తూ ఆదర్శంగా నిలవాలని మంత్రి ఆకాంక్షించారు.

# రాష్ట్రస్థాయి నెట్ బాల్ పోటీలకు ఎంపికైన కల్వల విద్యార్థులు



కేసముద్రం, మహబూబాబాద్, ప్రతినిధి, నవంబర్ 19, తరంగాలు : సముద్రం మండలంలోని కల్వల గ్రామంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల కల్వల విద్యార్థులు నెట్ బాల్ రాష్ట్ర స్థాయికి పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయులు బండారు నరేందర్, ఫిజికల్ డైరెక్టర్ కొప్పుల శంకర్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల9న నెల్లికుదురు మండల కేంద్రంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఉమ్మడి జిల్లా నెట్ బాల్ అండర్ 17 విభాగంలో ఎంపికలు జరిగిన సందర్భంగా. గుగులోతు నితీష్ , బానోత్ అనిత,వీరు అత్యుత్తమ ప్రదర్శన కనబరిచి రాష్ట్రస్థాయికి ఎంపికయ్యారని తెలిపారు. కాగా వీరు ఈనెల 21 నుంచి 23వ తేదీ వరకు నలగొండ జిల్లా అనుమల మండలంలోని టైం స్కూల్ జరిగే రాష్ట్రస్థాయిలో క్రీడా పోటీలో పాల్గొంటారని పేర్కొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులను ప్రధానోపాధ్యాయులు మరియు ఉపాధ్యాయులు అభినందించారు. ఈ కార్యక్రమంలో ర ఏకాంబరం,బి సత్యనారాయణ, టీ. సదానందం, వి. నాగేందర్, ఎం. యకంబ్రం,ర. బిక్షపతి, రాజేంద్ర చారి, కె. రాములు, ఎం. శ్రీనివాస్, బాల్ షవరెడ్డి,ఎండ్. జుబేర్ అలీ, కె. పార్వతి, వి. రాము, నాగరాజు, లింగయ్య, ఉదయ్, సునీల్ , రాధా తదితరులు అభినందించారు.

# విద్యకు అత్యధిక ప్రాధాన్యత ఇస్తున్న రాష్ట్ర ప్రభుత్వం

- విద్యా రంగంలో దేశానికే రోల్ మాడల్ గా తెలంగాణ
- 200కోట్లతో ఒకే కాంప్లెక్స్ లో 4గురుకులాల ఏర్పాటు
- విద్యార్థులు మనసు పెట్టి చదివి పోటీ ప్రపంచంలో నిలబడాలి
- ఉపాధ్యాయులు విద్యార్థులను స్వంత బిడ్డలుగా చూసుకోవాలి







జఫర్గడ్ ప్రతినిధి, నవంబర్ 19, (తరంగాలు) : మండలం లోని కస్తూరిభా గాంధీ, ఆదర్శ పాఠశాలకు అలాగే స్టేషన్ ఘనపూర్ మండలం నమిలిగొండ లోని కస్తూరిభా గాంధీ మరియు ఆదర్శ పాఠశాలలకు సిసి రోడ్డు నిర్మాణ పనులకు ఎమ్మెల్యే కడియం శ్రీహరి గారితో కలిసి వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య గారు శంకుస్థాపన చేశారు.లిఈ సందర్భంగా వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య మాట్లాడుతూసమాజంలో మహిళలు అభివృద్ధి చెందినప్పుడే దేశం అభివృద్ధి చెందుతుందని, మహిళల పురోగతినే దేశ పురోగతిగా భావించాలి అని వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య అన్నారు. 2011లో కేజీబీవీ స్థాపించినప్పటి నుంచి ఈ పాఠశాలకు రోడ్ సౌకర్యం లేకపోవడం బాధాకరమని, ఇది గత పాలకుల నిర్లక్ష్యానికి నిదర్శనం అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం వ్యక్తుల కోసం కాకుండా వ్యవస్థ బలోపేతం కోసం పని చేస్తోందని పేర్కొన్నారు. విద్యాశాఖ మంత్రిగా ఉన్న కడియం శ్రీహరి గురుకుల పాఠశాలలను ఇంటర్ స్థాయికి అప్గ్రేడ్ చేసిన నిర్ణయం వల్ల అనేక మంది విద్యార్థినీలు నాణ్యమైన విద్యను పొందుతున్నారని తెలిపారు. విద్యార్థినిలు సావిత్రిబాయి పూలేను ఆదర్శంగా తీసుకుని విద్యలో ముందుకు సాగాలని సూచించారు. చదువులో ఇతరులతో పోల్చుకోకుండా స్వీయ పోటీ భావనతో ముందుకు సాగాలని విద్యార్థినులను కోరారు. పేదరికం నుండి బయటపడేందుకు చదువే ప్రధాన మార్గమని, దాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. బాలికలు సోషల్ మీడియా వినియోగంలో అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ప్లే బ్యాక్ సొసైటీని ఆదర్శంగా తీసుకుని ప్రతిభను అభివృద్ధి చేసుకోవాలని చెప్పారు. విద్యార్థులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఉండేందుకు తన ఎంపీ నిధులతో అవసరమైన సౌకర్యాలను కల్పించినట్లు తెలిపారు. మేము సదుపాయాలు కల్పించడం మా బాధ్యత మీరు చదువుకొని ఉన్నత శిఖరాలు అధిరోహించడం మీ బాధ్యత" అని విద్యార్థులను ఎంపీ ప్రేరేపించారు. విద్యార్థులు బాగా చదివి తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని సూచించారు. ప్రభుత్వ పాఠశాలల్లో రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న సౌకర్యాలను సద్వినియోగం చేసుకుని ఇతర విద్యార్థులకు ఆదర్శంగా నిలవాలని పిలుపునిచ్చారు. అమ్మాయిలు చదువుకుంటేనే దేశ అభివృద్ధి వేగవంతమవుతుంది. విద్యతో పాటు కళలను అభివృద్ధి చేసుకోవాలి. విద్యార్థినిలు శారీరకంగా-మానసికంగా దృఢంగా ఉండాలని ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలి" అని ఎంపీ డాక్టర్ కావ్య అన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కడియం శ్రీహరి మాట్లాడుతూ చదువుకు మాత్రమే జీవితాలను మార్చే శక్తి ఉందని, చదువుతోనే ఆర్థిక స్వేచ్ఛ, సమాజంలో గౌరవం లభిస్తాయని తెలిపారు. ముఖ్యంగా విద్యా, ఉద్యోగం, ఆర్థిక స్వేచ్ఛ, ఆరోగ్యం తోనే మహిళా సాధికారత సాధ్యం అవుతుందని అన్నారు. బాలికలు సెల్ ఫోన్, సోషల్ మీడియా జోలికి వెళ్లకుండా కష్టపడి చదివి తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని సూచించారు. కేవలం మహిళలు విద్యావంతులు అయితేనే కుటుంబం బాగుపడుతుందని, కుటుంబాన్ని, పిల్లలను సరైన మార్గంలో నడపగలదని పేర్కొన్నారు. అత్యధిక గురుకుల పాఠశాలలతో విద్యా రంగంలో తెలంగాణ దేశానికే రోల్ మాడల్ గా నిలుస్తుందని తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా 1600గురుకుల పాఠశాలలో సుమారు 8లక్షల మంది విద్యార్థులు ఉన్నారని అందులో దాదాపు 5లక్షల మంది బాలికలే ఉన్నారని తెలిపారు. రెండు పర్యాయాలు విద్యా శాఖ మంత్రి గా పని చేశానని అప్పుడు గురుకులాల ఏర్పాటులో బాలికలకే ఎక్కువ ప్రాధాన్యత ఇచ్చానని తెలిపారు. రాష్ట్రంలోని ప్రతీ మాడల్ స్కూల్ లో హాస్టల్ సదుపాయం ఏర్పాటు చేశానని అన్నారు. రాష్ట్రంలో యాంగ్ ఇండియా ఇంటిగ్రెటెడ్ రెసిడెన్షియల్ పాఠశాలలను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. 200కోట్ల నిర్మించనున్న ఒక్కో పాఠశాలలో ఒకే కాంప్లెక్స్ లో 4 గురుకులాలు ఉండనున్నాయని తెలిపారు.మన నియోజకవర్గంలో జఫర్ గడ్ మండలం కొన్నాయిచలం వద్ద యాంగ్ ఇండియా స్కూల్ నిర్మించనున్నట్లు తెలిపారు. రాష్ట్రంలోని గురుకుల విద్యార్థులు కార్పొరేట్ విద్యార్థులతో పోటీ పడుతూ జేఈఈ, నీట్ వంటి పరీక్షలలో ఉత్తమ ర్యాంక్ లు సాధించి దేశంలోనే ప్రతిష్టాత్మక విద్యా సంస్థలలో సీట్లు సాధిస్తున్నారని అన్నారు. విద్యార్థుల ఉత్తమ ఫలితాలకు కారకులైన ఉపాధ్యాయులను అభినందించారు. అలాగే ప్రతీ విద్యార్థిని ఉపాధ్యాయులు తమ స్వంత బిడ్డలుగా చూసుకోవాలని, విద్యార్థులను ప్రోత్సహిస్తూ వారిపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని సూచించారు. పేదింటి బిడ్డలే అయినా తెలివిలో ఎవరికీ తీసిపోరని వారి నాపుణ్యాన్ని గుర్తించి సరైన శిక్షణ ఇస్తే అద్భుతాలు సృష్టిస్తారని కొనియాడారు. స్టేషన్ ఘనపూర్ నియోజకవర్గం లోని 7కస్తూరిభా గాంధీ పాఠశాలలో వసతుల కల్పనకు 6కోట్లు మంజూరు అయ్యాయని అన్నారు. జఫర్ గడ్ కస్తూరిభా గాంధీ, ఆదర్శ పాఠశాలలో ఎంపీ నిధులతో వాటర్ ప్లాంట్ ఏర్పాటు, ఇప్పుడు ఈజీఎస్ నిధులు 21లక్షలతో సిసి రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేసుకున్నట్లు తెలిపారు. ఇప్పటికే టాయిలెట్స్, బాత్రూం, ఇతర మౌలిక వసతుల కల్పనకు 41లక్షలు మంజూరు అయ్యాయని తెలిపారు. అలాగే పాఠశాలలో క్రీడా మైదానం ఏర్పాటుకు, సంప్ నిర్మాణానికి, తరగతి గదుల నిర్మాణానికి వెంటనే ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అధికారులకు సూచించారు. స్టేషన్ ఘనపూర్ కస్తూరిభా గాంధీ, ఆదర్శ పాఠశాలలకు 28లక్షలతో సిసి రోడ్డు నిర్మాణం చేపడుతున్నట్లు తెలిపారు. న్సిపాలిటీ అభివృద్ధి లో భాగంగా కోటి రూపాయలతో జఫర్ గడ్ ప్రధాన రహదారి నుండి కస్తూరిభా గాంధీ పాఠశాల వరకు సిసి రోడ్డు నిర్మాణంతో పాటు లైటింగ్ ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ఇప్పటికే మంజూరు అయిన 45లక్షలతో పనులు జరుగుతున్నాయని అన్నారు. వాటితో పాటు టాయిలెట్స్, బాత్రూం, సంప్, అంతర్గత సిసి రోడ్ల నిర్మాణానికి మరో కోటి రూపాయలు మంజూరు చేస్తానని హామీ ఇచ్చారు. మొత్తం సుమారు 3కోట్లతో కస్తూరిభా గాంధీ, మాడల్ స్కూల్లను అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తున్నాని తెలిపారు. పోలీస్ అధికారులు ఈ ప్రాంతాన్ని సెక్యూరిటీ జోన్ గా పరిగణించి రాత్రి సమయంలో పెట్రోలింగ్ నిర్వహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ లావణ్య శిరీష్ రెడ్డి,పాక్స్ చైర్మన్ కరుణాకర్రావు, మార్కెట్ వైస్ చైర్మన్ ఐలయ్య, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు ఎల్లయ్య, ఎమ్ ఆర్ ఓ రాజేష్ రెడ్డి, ఎంపీవో సుమన్,మండల కాంగ్రెస్ నాయకులు రాజేష్ నాయక్,బిక్షపతి,సుదర్శన్, శ్రీనివాస్, సుధాకర్ బాబు,కృష్ణ మూర్తి,ప్రభాకర్, యాదగిరి, అశోక్,మార్కెట్ డైరెక్టు బాబు, సురేష్ నాయక్, రాజేందర్,సందీప్, సాంబారాజు,విద్యా శాఖ అధికారులు, ప్రిన్సిపాల్స్, ఉపాధ్యాయులు, విద్యార్థులు, ఇతర అధికారులు, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# యువకులకే సర్పంచ్ గిరి - రాణా ప్రతాప్ రెడ్డి





నర్సంపేట నవంబర్ 19 తరంగాలు : రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో నర్సంపేట నియోజకవర్గం లో అత్యధిక స్థానాలు యువకులకు కేటాయించనున్నట్లు బిజెపి వరంగల్ జిల్లా ప్రధాన కార్యదర్శి గోగుల రాణా ప్రతాప్ రెడ్డి వెల్లడించారు బుధవారం హన్మకొండ లోని సత్యం కన్వెన్షన్ హాల్లో బీజేవైఎం వరంగల్ జిల్లా అధ్యక్షుడు ఎర్రగొల్ల భరత్ వీర్ అధ్యక్షతన జరిగిన బీజేవైఎం ముఖ్య కార్యకర్తల విస్తృత సమావేశం జరిగింది. ఈ కార్యక్రమంలో యువమోర్చా రాష్ట్ర అధ్యక్షులు కుండే గణేష్ మాజీ శాసనసభ్యులు మార్తనేని ధర్మారావు బిజెపి వరంగల్ జిల్లా అధ్యక్షుడు గంటా రవికుమార్ పాల్గొనగా రాణా ప్రతాప్ రెడ్డి మాట్లాడుతూ యువకులే దేశానికి వెన్నెముక అని యువకులు రాజకీయంగా ముందుకు రావాలని ప్రజా సమస్యలపై పోరాటం చేస్తేనే ప్రజాప్రతినిధులు అవుతారన్నారు నర్సంపేట నియోజకవర్గంలో రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో యువకులకు ఎక్కువ అవకాశాలు కల్పించి ప్రజాప్రతినిధులుగా చేసే బాధ్యత తమదన్నారు ప్రజా ప్రతినిధుల ద్వారా గ్రామాల అభివృద్ధి సాధ్యమని యువకులు ఆస్థానంలో కూర్చుంటే ప్రజలకు మరింత మేలు జరిగే అవకాశం ఉంది కావున వారికి ఎక్కువ అవకాశాలు కల్పించనున్నట్లు రాణా ప్రతాప్ రెడ్డి వెల్లడించారు. అనంతరం బీజేవైఎం రాష్ట్ర అధ్యక్షుడు గుండె గణేష్ ను శాలువాతో సన్మానించారు ఈ కార్యక్రమంలో నర్సంపేట నియోజకవర్గ బీజేవైఎం నాయకులు పాల్గొన్నారు.

# ఉపాధ్యాయులకు అందని గౌరవ వేతనం

- సమగ్ర కుటుంబ సర్వే చేసి సంవత్సరం
- తెలంగాణ పోగ్రెసివ్ టీచర్స్ ఫెడరేషన్ కేసముద్రం మండల శాఖ అధ్యక్షులు గుండు సురేందర్
- గత సంవత్సరం నవంబర్ లో సర్వే కార్యక్రమం
- కొన్ని జిల్లాల్లో కొన్ని మండలాలకే ఇచ్చి,రాష్ట్రమంతా ఇచ్చినట్లుగా అసెంబ్లీలో ప్రకటించిన ముఖ్యమంత్రి
- ప్రభుత్వం తీరు పట్ల విస్మయం, అసహనం వ్యక్తం చేస ్తున్న ఉపాధ్యాయులు
- ఇకనైనా తక్షణమే చెల్లించేలా తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్



కేసముద్రం, మహబూబాబాద్, ప్రతినిధి, నవంబర్.19, తరంగాలు : తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సమగ్ర కుటుంబ,కుల గణన పూర్తి అయ్యి సంవత్సరం గడిచినా సర్వే నిర్వహించిన ఉపాధ్యాయులకు మాత్రం గౌరవ వేతనం ఇంకా చెల్లించక పోవడం బాధాకరమని,ప్రభుత్వం ఇప్పటికైనా తక్షణమే గౌరవ వేతనం చెల్లించాలని తెలంగాణ ప్రోగ్రెసివ్ టీచర్స్ ఫెడరేషన్ కేసముద్రం మండల శాఖ అధ్యక్షులు గుండు సురేందర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ప్రభుత్వ తీరును నిరసిస్తూ టి పి టి ఎఫ్ కేసముద్రం మండల అధ్యక్షులు గుండు సురేందర్ ఆధ్వర్యంలో కేసముద్రం విలేజ్ ప్రాథమిక పాఠశాలలో, ప్రధాన కార్యదర్శి నరసింహ రాజు నేతృత్వంలో యుపిఎస్ అర్పణపల్లి పాఠశాలలో మధ్యాహ్న భోజన సమయంలో నల్ల బ్యాడ్జి ధరించి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా అధ్యక్షులు గుండు సురేందర్ మాట్లాడుతూ గత సంవత్సరం నవంబర్ నెలలో ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా సమగ్ర కుటుంబ మరియు కుల గణన జరిపిందని, సంవత్సరం పూర్తయినా ఇంతవరకు సర్వే చేసిన ఉపాధ్యాయులకు మాత్రం ప్రభుత్వం గౌరవ వేతనం ఇంకా చెల్లించకపోవడం బాధాకరమని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. హనుమకొండ జిల్లాలో ధర్మసాగర్, వరంగల్ లో ఖిలా వరంగల్, జనగాంలో తరిగొప్పుల, సిద్ధిపేట, యాదాద్రి, పెద్దపెల్లి జిల్లాలో కొన్ని మండలాలు, మేడ్చల్ మల్కాజ్ గిరిలో..ఇలా కొన్ని జిల్లాలలో కొన్ని మండలాలకు మాత్రమే చెల్లించినప్పటికీ మన జిల్లాతో యుక్తంగా ఇంకా చాలా జిల్లాల్లో పెండింగ్ లోనే ఉందని వివరించారు. ఇలా కొంతవరకు మాత్రమే చెల్లించి, అందరికి చెల్లించినట్లుగా స్వయంగా రాష్ట్ర ముఖ్యమంత్రి ప్రకటించడం వెనుక ఉన్న ఆంతర్యం ఏమిటో అర్థం కావట్లేదని అన్నారు. ఇది ప్రభుత్వ వ్యూహం లో భాగమేనా.. ? అని ఆయన ప్రశ్నించారు. ఈ విషయమై టి పి టి ఎఫ్ ఆధ్వర్యంలో మండల,జిల్లా స్థాయిలో అనేకమార్లు విజ్ఞాపనలు కూడా ఇచ్చామని, అయినా ప్రభుత్వం స్పందన లేదని, అసలు ప్రభుత్వానికి ఇచ్చే ఉద్దేశం ఉందా లేదా???అనేది కూడా స్పష్టం చేయాలని అన్నారు. సర్వే పూర్తిచేసే క్రమంలో ఉపాధ్యాయులపై ఎనలేని ఒత్తిడి తెచ్చి మానసిక వేదనకు గురిచేసిన అధికారులు గౌరవ వేతనం చెల్లించడంలో ఎందుకు బాధ్యతగా వ్యవహరిస్తలేరో అర్థం కావటం లేదని అన్నారు. ప్రభుత్వం, అధికారుల ఈ తీరు పట్ల ఉపాధ్యాయులంతా అసహనం, విస్మయం వ్యక్తం చేస్తున్నారనే విషయం గమనించాలని కోరారు. ఇంకా తాత్సారం చేయకుండా అధికారులు, ప్రభుత్వం సత్వరమే స్పందించి తగిన చర్యలు తీసుకొని గౌరవ వేతనం అందించేలా కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి వీసం నర్సయ్య, ఊటుకూరి ప్రణయ్ కుమార్,ఉపాధ్యాయులు అప్పాల నాగరాజు, వెలమాల భాస్కర్, ఎం. నరసింహ స్వామి, బి.సురేష్ కుమార్, ఏ. రమాదేవి తదితరులు పాల్గొన్నారు.

# మహిళలకు కుట్టు మిషన్లు పంపిణీ

- రోటరీ క్లబ్ వారి సహకారంతో కుట్టు శిక్షణ పొందిన మహిళలకు కుట్టు మిషన్లు అందజేసిన ఎమ్మెల్యే కెఆర్ నాగరాజు





వర్ధన్నపేట ప్రతినిధి, నవంబర్ 19,తరంగాలు : హన్మకొండ జిల్లా ఐనవోలు మండల పరిధిలోని కక్కిరాలపల్లి గ్రామంలో ఇచ్చిన హామీ మేరకు, కుట్టు శిక్షణ కేంద్రంలో శిక్షణ పొందిన పలువురు మహిళలకు కుట్టు మిషన్లు పంపిణీ చేస్తానని చెప్పిన వాగ్దానాన్ని వర్ధన్నపేట నియోజకవర్గ ఎమ్మెల్యే, విశ్రాంత ఐపీఎస్ అధికారి కేఆర్ నాగరాజు అమలు చేశారు.రోటరీ క్లబ్ వారి సహకారంతో మొత్తం 10 కుట్టు మిషన్లను లబ్ధిదారులకు ఎమ్మెల్యే అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాగరాజు మాట్లాడుతూ కక్కిరాలపల్లి గ్రామాల్లో ఏర్పాటు చేసిన కుట్టు శిక్షణ కేంద్రం ద్వారా మహిళలు ఆర్థికంగా స్వావలంబన సాధించడం ఆనందకరమని చెప్పారు. ఇచ్చిన మాటను నిలబెట్టుకుంటూ రోటరీ క్లబ్ సహకారంతో 10 కుట్టు మిషన్లను పంపిణీ చేయడం చాలా సంతోషంగా ఉందని పేర్కొన్నారు. మహిళలు స్వయం ఉపాధి ద్వారా కుటుంబాభివృద్ధి, గ్రామాభివృద్ధికి దోహదం చేస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు. మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలతో గ్రామాల పురోగతికి కట్టుబడి ఉంటామని ఎమ్మెల్యే నాగరాజు హామీ ఇచ్చారు. అలాగే రోటరీ క్లబ్ సహాయంతో వర్ధన్నపేట నియోజకవర్గంలో విద్యార్థులకు బంక్ బెడ్స్, పిల్లలకు ఆట వస్తువులు రోటరీ ద్వారా చేయ-ూతనందించామన్నారు.. ఈ కార్యక్రమంలో రోటరీ క్లబ్ సభ్యులు కోరే చంద్రమౌళి, గణేష్ కుమార్,హరినాథ్, కుమారస్వామి తో పాటు ప్రజా ప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ మండల, గ్రామ స్థాయి నాయకులు, కార్యకర్తలు, వివిధ అనుబంధ సంఘాల నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

# ధాన్యం కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి

- నర్సంపేట మార్కెట్ చైర్మన్ పాలాయి శ్రీనివాస్





నల్లబెల్లి, నవంబర్ 19: తరంగాలు : ప్రభుత్వం ఏర్పాటు చేసిన దాన్యం కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని నర్సంపేట మార్కెట్ చైర్మన్ పాలాయి శ్రీనివాస్ అన్నారు.నల్లబెల్లి మండలం నారక్క పేట, రాంపూర్,మేడపల్లి గ్రామాలలో ప్రభుత్వం ఏర్పాటుచేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను నర్సంపేట శాసనసభ్యులు దొంతి మాధవ రెడ్డి ఆదేశాలతో నర్సంపేట మార్కెట్ చైర్మన్ పాలాయి శ్రీనివాస్ ఐకెపి వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దళారులను నమ్మి రైతులు మోసపోవద్దని, ప్రభుత్వం ఏర్పాటు చేసిన దాన్యం కొనుగోలు కేంద్రాలలో దాన్యం విక్రయించి, మద్దతు ధరను పొందాలన్నారు. అదేవిధంగా రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలని కేంద్రం నిర్వహకులకు సూచించారు. ఈ కార్యక్రమంలో నల్లబెల్లి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు చిట్యాల తిరుపతిరెడ్డి, మండల కాంగ్రెస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ వైనాల అశోక్,ఇస్తార్,శేఖర్ గౌడ్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ జ్యోతి, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షులు పురుషోత్తం, సురేష్, కాంగ్రెస్, పార్టీ నాయకులు చిట్యాల ఉపేందర్ రెడ్డి, జంగిలి మోహన్, శ్రీపతి సుమన్, వంగర వెంకన్న, దుద్యాల సంపత్ రావు, వడ్లూరి రమేష్, పోగుల కుమారస్వామి, రనిల్, మంద చింటూ, కుంచాల రాజు, బొంపల్లి శ్రీనివాస్, ఏపీఎం సుధాకర్, అధికారులు, రైతులు, కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా ఇందిరా గాంధీ జయంతి వేడుకలు



నల్లబెల్లి / నవంబర్ 19 తరంగాలు : నర్సంపేట శాసనసభ్యులు దొంతి మాధవ రెడ్డి ఆదేశాల మేరకు నల్లబెల్లి మండల కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో భారత దేశ తొలి మహిళా ప్రధానమంత్రి ఇందిరా గాంధీ జయంతి ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు.మండల కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున హాజరయ్యారు. ఈ సందర్భంగా మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు చిట్యాల తిరుపతి రెడ్డి ఇందిరా గాంధీ చిత్రపటానికి పుష్పమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం పండ్లు పంపిణీ చేశారు.వారు మాట్లాడుతూ ఇందిరా గాంధీ దేశ అభివృద్ధి కోసం తీసుకున్న ప్రజాహిత నిర్ణయాలు, దూరదృష్టి, కఠిన నాయకత్వం నేటికీ దేశాన్ని ముందుకు నడిపిస్తున్నాయని ఆయన గుర్తుచేశారు. కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యదర్శి మాలోత్ రమేష్, వర్కింగ్ ప్రెసిడెంట్ వైనాల అశోక్, ఇస్తారు శేఖర్, మార్కెట్ డైరెక్టర్ జ్యోతి, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు సురేష్, మాజీ వర్కింగ్ ప్రెసిడెంట్ మాలోత్ చరణ్ సింగ్, వీ ఎఫ్ జీ చైర్మన్ శ్రీనివాస్, మండల కార్యదర్శి జెట్టి రామూర్తి,నాయకులు బత్తిని మహేష్, ఎరుకల రవీందర్, బుంపల్లి శ్రీనివాస్, దూలపెల్లి రవీందర్ రావు, జరప్పుల రమేష్, వక్కల శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

# నూతన ఎస్సైని కలిసిన బిజెపి నాయకుడు నరేందర్ ముదిరాజ్



తరంగాలు, గజ్వేల్ నవంబర్ 19 : గజ్వేల్ నియోజకవర్గం, ములుగు మండల నూతన ఎస్సైగా పదవి బాధ్యతలు స్వీకరించిన రఘుపతిని ములుగు బిజెపి పార్టీ మండల కార్యవర్గ సభ్యుడు నరేందర్ ముదిరాజ్ మర్యాదపూర్వకంగా కలిసి ఆయనకు శుభాకాంక్షలు తెలియజేశారు. శాంతి భద్రతల పరిరక్షణలో కృషి చేస్తున్న పోలీసు శాఖకు అన్ని విధాలుగా సహకరిస్తామని స్పష్టం చేశారు.

# పరామర్శ



భీమారం మండలం, నవంబర్ 19, తరంగాలు : మండల కేంద్రంలోని కమ్మరిపేట గ్రామానికి చెందిన చుక్క రాజేశం, రాగోజిపేట గ్రామానికి చెందిన చిలువేరి నర్సయ్య లు గత కొద్ది రోజుల క్రితం మరణించగా స్థానిక నాయకులతో కలిసి వారి కుటుంబ సభ్యులను పరమర్శించిన భీమారం మండల కాంగ్రెస్ పార్టీ అద్యక్షులు సింగిరెడ్డి నరేష్ రెడ్డి .వారి వెంట ఉరుమట్ల లక్ష్మన్, రెండ్ల మధు, బొమ్మెన ప్రశాంత్, చెక్కపెల్లి సంజీవ్, ఏనుగంటి హరీష్, భూరం అరుణ్, పడాల వెంకటచారి, బాలసాని లహరిక మారుతి, లక్మల రాజన్న తదిరులు ఉన్నారు.

# సోయా కొనుగోలు సమస్యలపై తహశీల్దారు వినతిపత్రం



తరంగాలు, మద్నూర్ నవంబర్ 19 : కామారెడ్డి జిల్లా మద్నూర్ సోయా కొనుగోలు కేంద్రంలో అధికారులు పరిశీలించి, తూకం వేసి పంపిన తర్వాత కూడా సోయాను తిరిగి పంపుతున్నారని రైతులు బుధవారం తహశీల్దార్ ఎం.డి. ముజీబ్ దృష్టికి తీసుకొచ్చారు. క్వాలిటీ అధికారులు క్షుణ్ణంగా పరిశీలించిన తర్వాత మళ్లీ పంపడం సరికాదని ఆవేదన వ్యక్తం చేస్తూ వినతిపత్రం అందజేశారు. దీనిపై అడిషనల్ కలెక్టర్తో మాట్లాడినట్లు ముజీబ్ రైతులకు తెలిపారు.

# నేడు సీసీఐలో యథావిధిగా పత్తి కొనుగోళ్లు...!



తరంగాలు, మద్నూర్ నవంబర్ 19 : కామారెడ్డి జిల్లా మద్నూర్ కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (సీసీఐ) కొనుగోలు కేంద్రంలో నేడు యథావిధిగా స్లాట్ బుకింగ్ తో పాటు పత్తి కొనుగోళ్లు ఉంటాయని సీసీఐ, వ్యవసాయ మార్కెట్ శాఖ అధికారులు తెలిపారు. కాగా అమవాస్య కారణంగా రేపు కొనుగోళ్లు బంద్ ఉంటాయని తెలిపిన అధికారులు.. తర్వాత యథావిధిగా పత్తి కొనుగోళ్లు ఉంటాయని పేర్కొనడం గమనార్హం. కాగా సీసీఐ కొనుగోలు ఉంటాయని స్లాట్ బుక్ చేసుకొని పత్తి తీసుకుని రావాలని కోరారు.

# పేదరిక నిర్మూలన కోసం ఎనలేని కృషి చేసిన మహనీయురాలు ఇందిరా గాంధీ

- మండల అధ్యక్షుడు ఎద్దు సత్య నారాయణ, టౌన్ ప్రసిడెంట్ మైస సురేష్, మార్కెట్ కమిటీ చైర్మన్ నరుకుడు వెంకటయ్య



వర్ధన్నపేట ప్రతినిధి, నవంబర్ 19,తరంగాలు : దేశంలో పేదరిక నిర్మూలన కోసం మాజీ ప్రధాని ఇందిరా గాంధీ ఎనలేని కృషి చేశారని మండల అధ్యక్షుడు ఎద్దు సత్య నారాయణ,టౌన్ ప్రసిడెంట్ మైస సురేష్, మార్కెట్ కమిటీ చైర్మన్ నరుకుడు వెంకటయ్య అన్నారు. వర్ధన్నపేట మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ఎద్దు సత్య నారాయణ,టౌన్ ప్రసిడెంట్ మైస సురేష్ అధ్వర్యంలో మాజీ ప్రధాన మంత్రి ఇందిరా గాంధీ 108 వ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా మండల అధ్యక్షుడు ఎద్దు సత్య నారాయణ, వర్ధన్నపేట టౌన్ ప్రసిడెంట్ మైస సురేష్,ఎస్సీ సెల్ రాష్ట్ర నాయకులు, వర్ధన్నపేట వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ నరుకుడు వెంకటయ్య జిల్లా సీనియర్ నాయకులు పోషాల వెంకన్న గౌడ్ ఆమహనీయురాలు చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బడుగు బలహీన వర్గాలు, దళితులతో పాటు మైనార్టీలంతా .దేశాన్ని సమున్నతంగా నిలబెట్టిన మాజీ ప్రధాని ఇందిర గాంధీ అన్నారు. 1966 లో ఇందిరా గాంధీ ప్రధాన మంత్రి అయిన నాటికి దేశములో ఆర్థిక మాంద్యం,పారిశ్రామిక ఉత్పత్తుల పతనం,ఎగుమతులు తగ్గడం,ఆహార ధాన్యాల సంక్షోభం ఏర్పడ్డాయి. వీటితో పాటు బడ్జెట్ డేపిసిట్ పెరగడం,విదేశీ ఆర్థిక సాయంపై ఎక్కువగా ఆధారపడటం వంటివే గాక 1962,1965 నాటి యుద్ధాలు, పాకిస్థాన్,చైనా కూటమి ఏర్పాటులో సైన్యం పై ఖర్చు పెంచడం వంటివి జరిగాయి వర్షాలు లేక కరువు ఏర్పడింది.ధరలు పెరిగాయి,పాలన ఖర్చులు తగ్గించుకోవడం వీలుపడలేదు అయినా యుద్ధ ప్రాతిపదికన ఆహార ధాన్యాలు సేకరించి ప్రజలకు పంచి, వారి ప్రాణాలను కాపాడగలిగారు. 1970 లో అనేక దేశాలు ఆయిల్ సంక్షోభంలో కొట్టుమిట్టాడిన భారత్ ను మాత్రం ఆ సమస్య నుంచి ఇందిర కాపాడగలిగారు.అదేవిధంగా దేశములోని పేదరికాన్ని ప్రారదోలాడానికి గరిభి హేట్టావో , 20 సూత్రాల పథకంలి ప్రవేశ పెట్టడమే కాకుండా బ్యాంకులన జాతీయకరణ, రాజభరణాలు రద్దు చేసి ఆదూకున్న ఘనత ఇందిర గాంధీది.ఈ కార్యక్రమం లో కాంగ్రెస్ పార్టీ మహిళా మండల అధ్యక్షురాలు మరుపట్ల అరుణ, యూత్ కాంగ్రెస్ మండల ఉపాధ్యక్షుడు కుల్ల యాకంతం, ఐనవోలు టెంపుల్ డైరెక్టర్ గుంటి కుమార స్వామి సీనియర్ నాయకులు గుజ్జ రవీందర్ రెడ్డి, మాజీ కో ఆప్షన్ నంబర్ ఎండి అన్వర్,రాజా రాజేశ్వర టెంపుల్ చైర్మన్ మైదం బుచ్చి మల్లు,గడ్డం సమ్మయ్య గౌడ్, దమ్మన్నపేట మాజీ సర్పంచ్ మనోహర్ రెడ్డి,ల్యాబర్తి,అంబేద్కర్ నగర్ ,ఇల్లంద గ్రామ పార్టీ ల అధ్యక్షులు చిదుముల్ల భాస్కర్,సింగపురం ఎలియాస్,ఎద్దు రాజేంద్ర ప్రసాద్,మహిళా నాయకురాండ్లు , లింగం రజితరెడ్డి, ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు మల్లెపాక సమ్మయ్య,,మరుపట్ల సాయికుమార్,దికొండ ఉపేందర్, సంకినేని దేవేందర్ రావు,రావుల గంగయ్య,గంగరాజు, చిటూరి రాజు, , ఒగ్గుల మాధవి, బెజ్జం పాపారావు, కత్రియా ల టెంపుల్ చైర్మన్ కట్ట వెంకటయ్య, చిర బోయిన రాజు, మెరుగు రమేష్, తుమ్మల కుమారస్వామి, రాకేశ్ ముదిరాజ్ బండారి యాకయ్య,సంతోష్ ,యాకయ్య,తదితరులు పాల్గొన్నారు.

# గ్రామాల అభివృద్ధికి ప్రజా ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత

- ముల్కలగూడెం గ్రామంలో ఎస్ డి ఎఫ్ నిధుల ద్వారా 25 లక్షల రూపాయల వ్యయంతో నిర్మాణం చేపట్టిన రోడ్డు ను ప్రారంభించిన ఎమ్మెల్యే కె ఆర్ నాగరాజు









వర్ధన్నపేట ప్రతినిధి, నవంబర్ 19, తరంగాలు : గ్రామాల అభివృద్ధి ప్రభుత్వానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తుందని వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు అన్నారు.హన్మకొండ జిల్లా ఐనవోలు మండల పరిధిలోని ముల్కలగూడెం గ్రామంలో ఎస్ డి ఎఫ్ నిధుల ద్వారా సుమారు 25లక్షల వ్యయంతో నిర్మాణం చేపట్టిన రోడ్డు ను వర్ధన్నపేట నియోజకవర్గ ఎమ్మెల్యే, విశ్రాంత ఐపీఎస్ అధికారి కేఆర్ నాగరాజు ప్రారంభించారు. అనంతరం గ్రామంలో నూతనంగా ఏర్పాటు చేసిన కాంగ్రెస్ పార్టీ జెండా గద్దెను స్థానిక గ్రామ కాంగ్రెస్ నాయకులతో కలిసి ఎమ్మెల్యే నాగరాజు ఆవిష్కరించారు.తదనంతరం ప్రభుత్వ పాఠశాలలో పిల్లలతో కలిసి మమేకమై పాఠశాలలో ఉన్న సమస్యలను తెలుసుకొని త్వరితిగతన వాటిని పరిష్కరించేందుకు కృషి చేస్తానన్నారు. గ్రామంలోని మహిళా సంఘాల కోసం నా సిడిఎఫ్ నిధుల నుంచి 10 లక్షల రూపాయలు త్వరలోనే కేటాయించి భవన నిర్మాణానికి సహకరిస్తానని మహిళా సంఘాలకు హామీ ఇచ్చారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాగరాజు మాట్లాడుతూ ముల్కలగూడెం గ్రామంలో రహదారులు, డ్రైనేజీ, తాగునీటి లైన్లు, విద్యుత్ సౌకర్యాలు, కమ్యూనిటీ అవసరాల కోసం మౌలిక వసతులను సమగ్రంగా అభివృద్ధి చేసే దిశగా ఈ నిధులను వినియోగించనున్నాం. ప్రజలకు మౌలిక సౌకర్యాలు అందించడంలో ఎటువంటి రాజీ ఉండదు. ప్రతి కుటుంబం జీవన ప్రమాణాలను మెరుగుపరచడమే మా లక్ష్యం. ప్రారంభించిన ఈ పనులను త్వరితగతిన పూర్తిచేసేలా సంబంధిత శాఖలతో సమన్వయం చేస్తాం'' అని తెలిపారు.ముల్కలగూడెం గ్రామ అభివృద్ధి కోసం ప్రభుత్వం కేటాయించిన నిధులను పారదర్శకంగా, ప్రజలకు నేరుగా ప్రయోజనం చేకూరే విధంగా వినియోగిస్తున్నాం. గ్రామంలోని ప్రతి కుటుంబం సుఖసంతోషాలతో జీవించేలా బాధ్యతగా పనిచేస్తూ ఉంటాం అని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు సమ్మెట మహేందర్ గౌడ్, దేవస్థానం చైర్మన్ కమ్మగోని ప్రభాకర్ గౌడ్, హనుమకొండ జిల్లా జేబీఎం అధ్యక్షులు జన్నపు రెడ్డి రుక్వేద్ రెడ్డి, సీనియర్ నాయకులు, మాజీ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు సాయి రెడ్డి, గ్రామ పార్టీ అధ్యక్షుడు లింగరాజు,ప్రజా ప్రతినిధులు కాంగ్రెస్ పార్టీ శ్రేణులు తదితరులు పాల్గొన్నారు.

# చేప పిల్లల పంపిణి కార్యక్రమం లో పాల్గొన్న మంత్రి అడ్లూరి



తరంగాలు, నవంబర్ 19 గొల్లపల్లి (ధర్మపురి ఆర్ సి) : జగిత్యాల జిల్లా ల్గటూర్ మండలం స్తంభంపల్లి గ్రామంలో గురువారం రోజున తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో 100 శాతం సబ్సిడీపై ఉచిత చేప పిల్లల విడుదల కార్యక్రమంలో రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రివర్యులు అడ్లూరి లక్ష్మణ్ కుమార్ జిల్లా అధికారులతో కలిసి పాల్గొనీ చేప పిల్లలను గ్రామ చెరువులో నేరుగా విడుదల చేశారు. అనంతరం వెల్గటూర్ మండలానికి చెందిన 29 మంది లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇళ్లకు సంబంధించిన ప్రొసీడింగ్స్ను అధికారులతో కలిసి అందజేసారు. కార్యక్రమానికి ముందుగా మంత్రి లక్ష్మణ్ కుమార్ గ్రామంలోని శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయాన్ని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు . ఈ సందర్భంగా మాట్లాడుతూ మత్స్యకారుల సంక్షేమం కోసం ప్రభుత్వం కట్టుబడి ఉంది గ్రామీణ ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేయడంలో చేపల పెంపకం కీలక పాత్ర పోషిస్తోంది అందుకే ప్రభుత్వం 100 శాతం సబ్సిడీతో చేప పిల్లలను పంపిణీ చేస్తోంది చెరువుల పునరుద్ధరణ నీటి నిల్వ సామర్థ్యాల పెంపు మార్కెట్ సదుపాయాల విస్తరణ.. ఈ దిశగా అన్ని చర్యలు తీసుకుంటున్నాం అని తెలిపారు మత్స్యకార కుటుంబాల ఆదాయాన్ని పెంచేందుకు ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ కార్యక్రమాలను ప్రతి గ్రామానికి విస్తరిస్తాం స్తంభంపల్లి గ్రామం మత్స్యోత్పత్తిలో మరింత అభివృద్ధి చెందాలని ప్రభుత్వం అన్ని విధాలా సహకరిస్తుంది అన్నారు ఈ కార్యక్రమం లో వెల్గటూర్ కాంగ్రెస్ పార్టీ మండల్ అధ్యక్షులు తాటిపర్తి శైలేందర్ రెడ్డి మరియు అధికారులు పార్టీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు

# మాజీ ప్రధానమంత్రి ఇందిరా గాంధీ జయంతి సందర్భంగా ..



తరంగాలు, నవంబర్ 19 (ధర్మపురి ఆర్ సి) : జగిత్యాల జిల్లా ధర్మపురి పట్టణ కేంద్రంలోని భారతరత్న శ్రీమతి ఇందిరాగాంధీ జయంతి సందర్భంగా ధర్మపురి పట్టణ కేంద్రంలోని స్థానిక ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన జయంతి వేడుకల్లో రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ పాల్గొని ఇందిరగాంధీ గారి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఇందిరాగాంధీ గారి లోహసంకల్పం దేశభక్తి పేదల పట్ల ఆమెకు ఉన్న మమకారం అపారమైనవని ప్రపంచ రాజకీయ రంగంలో భారతదేశాన్ని శక్తివంతమైన దేశంగా నిలబెట్టిన నాయకురాలు ఇందిరాగాంధీ గారని ఆమె తీసుకున్న నిర్ణయాలు అమలు చేసిన సంక్షేమ పథకాలు ఇప్పటికీ కోట్లాది మందికి మార్గదర్శకంగా నిలుస్తున్నాయని ప్రస్తుత తరం యువత ఇందిరాగాంధీ గారి సేవలను అధ్యయనం చేసి సమాజం కోసం పనిచేసే మనస్తత్వం పెంపొందించుకోవాలనీ గ్రామీణాభివృద్ధి మహిళా సాధికారత దేశ భద్రత విషయంలో ఆమె చూపిన ధైర్యసాహసాలు దేశ చరిత్రలో చిరస్మరణీయంగా నిలిచాయనీ తెలంగాణ రాష్ట్రం కూడా అదే దిశగా సంక్షేమం మరియు అభివృద్ధి పంథాలో ముందుకు సాగుతోందని పేర్కొన్నారు ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు

# పేదలకు న్యాయం చేయాలనే లక్ష్యం అందరికీ ఆదర్శం

## - జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మి కాంతారావు



తరంగాలు, మద్నూర్ నవంబర్ 19 : కామారెడ్డి జిల్లా భారత మాజీ మహిళా ప్రధాని,భారతరత్న, స్వర్గీయ శ్రీమతి ఇందిరా గాంధీ జయంతి సందర్భంగా బుధవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో కాంగ్రెస్ పార్టీ నాయకులతో కలిసి ఇందిరా గాంధీ చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులు అర్పించిన జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీ కాంతారావు ఈ సందర్బంగా ఎమ్మెల్యే తోట లక్ష్మీ కాంతారావు మాట్లాడుతూ.. ఇందిరా గాంధీ భారతదేశపు కీర్తిని ప్రపంచం నలుమూలలా చాటిచెప్పారని.. ఆమె రాజకీయ, వ్యక్తిగత జీవితంలో ఎన్నో ఒడుదొడుకులను ఎదుర్కొని శక్తిమంతమైన నాయకురాలిగా భారతదేశ చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోయిందని కొనియాడారు.. ఇందిరాగాంధీ దేశానికి అందించిన నిరుపమాన సేవలు నేటితరం నాయకులకు, యువతకు సైతం స్ఫూర్తిదాయకమని తెలిపారు.. బ్యాంకుల జాతీయకరణ, జమీందారీ వ్యవస్థ రద్దు, గరీబీ హఠావో వంటి దేశంలో ఎన్నో విప్లవాత్మకమైన మార్పులకు శ్రీకారం చుట్టారని అన్నారు.. ఇందిరా గాంధీ గారు భారత స్త్రీ శక్తికి ప్రతీక అని, ప్రపంచవ్యాప్తంగా మహిళలకు స్ఫూర్తినిచ్చే నాయకురాలిగా ప్రజల హృదయాల్లో నిలిచిపోయారని వెల్లడించారు.. అవకాశాలు వస్తే అద్భుతాలు చేయగలం అంటూ నిరూపించారని..ప్రతి మహిళకు ఆమె చూపిన ధైర్యం, అంకితభావం నేటికీ స్ఫూర్తినిస్తోందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సాయి పటేల్ మండల కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

# నిరుపేదల అభ్యున్నతికి పాటుపడిన ఉక్కు మహిళ ఇందిరా గాంధీ

## - మండల మార్కెట్ కమిటీ అధ్యక్షుడు మాదం వినోద్ యాదవ్



మేడిపల్లి మండలం, నవంబర్ 19, తరంగాలు : రాష్ట్ర ప్రభుత్వ విప్, వేములవాడ శాసనసభ్యులు ఆది శ్రీనివాస్ ఆదేశాల మేరకు మరియు మేడిపల్లి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ఏనుగు రమేష్ రెడ్డి మార్కెట్ కమిటీ చైర్మన్ మాదం వినోద్ యాదవ్ ల ఆద్వర్యంలో ఘనంగా ఇందిరాగాంధీ జన్మదిన వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఇందిరా గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. దేశం కోసం తన జీవితాన్ని అంకితం చేసిన గొప్ప నాయకురాలు ఇందిరాగాంధీ అని, పేదల సంక్షేమం, జాతీయ సమైక్యత, దృఢమైన నాయకత్వంఇవి ఆమె పాలనకు ప్రతీకలు అని, భారతదేశ అభివృద్ధి, మహిళా సాధికారత, శాంతి%-%భద్రతల పరిరక్షణలో ఆమె చేసిన కృషి ఎల్లప్పుడూ చిరస్థాయిగా నిలుస్తా- యనీ, మాజీ ప్రధాని ఇందిరాగాంధీ చూపిన ధైర్యం, సంకల్పం నేటి తరానికి స్ఫూర్తిదాయకంగా నిలుస్తాయని, పేదరిక నిర్మూలన కోసం అనేక పథకాలను రూపొందించి ప్రజల హృదయాల్లో చెరగని ముద్ర వేసిన ఉక్కు మహిళ, భారతరత్న ఇందిర గాంధీ అని, "భారతదేశ రాజకీయ చరిత్రలో అద్భుతమైన నాయకత్వ గుణాలు ప్రదర్శించిన మహానాయకురాలు ఇందిరాగాంధీ , దేశ అభివృద్ధి కోసం అనేక విప్లవాత్మక నిర్ణయాలు తీసుకున్నారు. దేశ ఆర్థిక స్వావలంబనకు దారితీసిన బ్యాంకుల జాతీయీకరణ, రైతాంగాన్ని బలోపేతం చేసిన హరిత విప్లవం, బంగ్లాదేశ్ విముక్తి యుద్ధంలో చూపిన ధైర్యసాహసాలు దేశాన్ని అంతర్జాతీయ వేదికపై శక్తివంతమైన దేశంగా నిలబెట్టాయి. ప్రజల సంక్షేమం కోసం జీవితాంతం అహర్నిశలు కృషి చేసిన ఆమె త్యాగస్ఫూర్తి యువతకు స్ఫూర్తిదాయకం" అని అన్నారు. ఈ కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి చేపూరి నాగరాజు ఎస్సీ సెల్ మండల అధ్యక్షులు మేదరీ లాజర్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు మార్గం నరసారెడ్డి ముస్కెం జలంధర్ గౌడ్ మరిపెల్లి స్వామి గౌడ్ వేముల లింబాద్రి డప్పు ప్రేమ్ సాగర్ మేధారి రాజన్న.. దేశెట్టి గంగాధర్ పానుగంటి రాజేష్ ఎండి యూసుఫ్ ఎండి జాఫర్ ఎదులపురం వేణు రాగుట్ల స్వామి పాల్గొన్నారు.

# ఇందిరాగాంధీ జయంతి వేడుకలు

## - మండల అధ్యక్షుడు ఇప్ప శ్రీనివాస్‌రెడ్డి




తరంగాలు, చొప్పదండి. అక్టోబర్ 19: భారతదేశ ఉక్కు మహిళ తొలి మహిళా ప్రధాని భారతరత్న స్వర్గీయ శ్రీమతి ఇందిరాగాంధీ 108 వ జయంతి సందర్భంగా చొప్పదండి కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో మండల కాంగ్రెస్ అధ్యక్షులు ఇప్ప శ్రీనివాస్ రెడ్డి పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు నిజానపురం చందు ఆధ్వర్యంలో వారి చిత్ర పటానికి పూలమాల వేసి ఘన నివాళులు అర్పించారు. అనంతరం శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ ఇందిరాగాంధీ అత్యవసర పరిస్థితుల్లో కూడా దేశాన్ని సమర్థంగా పరిపాలిస్తూ గరిబీ హటావో నినాదంతో దేశంలో పేదరికాన్ని నిర్మూలించాలన్న ధృడ సంకల్పంతో పరిపాలన సాగించారు. ఆమె కాలంలోనే బ్యాంక్ ల విలీనంతో పాటు ఎన్నో సంస్కరణలు చేపట్టారు. ఇప్పటికీ దేశంలో ఆమె ప్రవేశ పెట్టిన పథకాలను అమలు చేస్తున్నారు అంటే ఆమె దూరదృష్టి చాలా గొప్పదన్నారు. ఇట్టి కార్యక్రమంలో మండల నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద ఎత్తున హాజరు కావడం జరిగింది.

# ఈనెల 21న సలాబత్పూర్ ఆలయ హుండీ లెక్కింపు

తరంగాలు, మద్నూర్ నవంబర్ 19 : కామారెడ్డి జిల్లా మద్నూర్ మండలం సలాబత్పూర్ శ్రీ ఆంజనేయ స్వామి ఆలయంలో ఈ నెల 21న ఉదయం 11.30 గంటలకు హుండీ లెక్కింపు కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి (ఈవో) పి.శ్రీధర్ తెలిపారు. ఈ లెక్కింపులో ఆలయ ఛైర్మన్, సభ్యులు, దేవాదాయ ధర్మాదాయ శాఖ అధికారులు పాల్గొంటారని వివరించారు. భక్తులు కూడా ఈ కార్యక్రమంలో పాల్గొనాలని ఈవో కోరారు.

# పెద్ద ఎక్లార పాఠశాలలో విద్యార్థులకు నోట్ బుక్స్ వితరణ




తరంగాలు, మద్నూర్ నవంబర్ 19 : కామారెడ్డి జిల్లా మద్నూర్ మండలం పెద్ద ఎక్లార ప్రాథమిక పాఠశాలలో ప్రతిజ్ఞ దివస్ సందర్భంగా బుధవారం విద్యార్థులకు స్వేరోస్ జిల్లా అధ్యక్షుడు జి. లక్ష్మణ్ నోట్ బుక్స్, పెన్నులు వితరణ చేశారు. లక్ష్మణ్ మాట్లాడుతూ.. విద్యార్థులు చక్కగా చదువుకుని జీవితంలో ఉన్నతంగా ఎదగాలని అన్నారు. స్వేరోస్ ద్వారా డా. ప్రవీణ్ కుమార్ ఎంతోమంది విద్యార్థులను ఉన్నత విద్యావంతులుగా కృషి చేశారని కొనియాడారు. హెచ్ఎం శంకర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# మాదకద్రవ్యాలకు వ్యతిరేకంగా ప్రతి ఒక్కరు పని చేయాలి.. తహసిల్దార్ వెల్లడి..

తరంగాలు, ఇటిక్యాల, నవంబర్ 19 : మాదకద్రవ్యాలకు వ్యతిరేకంగా ప్రతి ఒక్కరూ పని చేయాలని తహసిల్దార్ వీరభద్రప్ప తెలియజేస్తూ అన్నారు. జోగులాంబ గద్వాల్ జిల్లా ఇటిక్యాల మండలం తహసిల్దార్ కార్యాలయం ఆవరణలో మంగళవారం నాశ ముక్త్ భారత్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా తహసిల్దార్ ప్రసంగించారు, డ్రగ్స్ మత్తు పదార్థాలు మాదకద్రవ్యాలు తదితర వాటికి నేటి ప్రజలు యువత అలవాటు పడితే ఎంత ప్రమాదకరమో తదితర వాటి అంశాల గురించి వివరాలు, అవగాహన డ్రగ్స్ మత్తు పదార్థాలపై వివరాలు గురించి తహసిల్దార్ వీరభద్రప్ప తెలియజేశారు. నాశ ముక్త్ భారత్ అభియాన్ కార్యక్రమం సందర్భంగా పాల్గొన్న ప్రజల చేత తహసిల్దార్ ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహసిల్దార్ నందిని, అధికారులు మనోహర్, కార్యాలయం సిబ్బంది, తదితరులు ప్రజలు పాల్గొన్నారు.

# ఉరుకుంద ఈరన్న స్వామి దేవాలయంలో సామూహిక హెూమం



తరంగాలు, ఆర్ గార్లపాడు, (ఇటిక్యాల), నవంబర్ 19 : జోగులాంబ గద్వాల్ జిల్లా ఆర్ గార్లపాడు గ్రామంలోని ఉరుకుందు ఈరన్న స్వామి దేవాలయంలో ప్రజలు భక్తులతో మంగళవారం సామూహిక హెూమము కార్యక్రమాన్ని నిర్వహించారు. సామూహిక హెూమము కార్యక్రమం అమావాస్య వరకు నిర్వహించడం జరుగుతుందని ఆలయం నిర్వాహకుడు హుస్సేన్ తెలియజేశారు. దేవాలయం దగ్గర భజన బృందాల ద్వారా భజన కార్యక్రమం, ఇక్కడికి వచ్చిన భక్తులకు అన్నదాన కార్యక్రమం, ఉరుకుందు ఈరన్న స్వామికి పంచామృత అభిషేకం. పూర్ణాహుతి కార్యక్రమం, తదితర కార్యక్రమాలు ఉంటాయని ఆలయ నిర్వాహకుడు తెలియజేశారు. వివిధ గ్రామాలలో నుండి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని హెూమం కార్యక్రమంలో పాల్గొనవలసిందిగా దేవాలయం నిర్వాహకుడు హుస్సేన్ తెలియజేస్తూ కోరారు.

# భారత రాజ్యాంగ పుస్తక బహుకరణ కార్యక్రమం పోస్టర్ ఆవిష్కరణ..



జగిత్యాల, నవంబర్ 19, తరంగాలు : భారత రాజ్యాంగ దినోత్సవం రోజున నామాపూర్ గ్రామంలో డాక్టర్ బి ఆర్ అంబేద్కర్ యూత్ క్లబ్ ఆధ్వర్యంలో జరగబోయే లిభారత రాజ్యాంగ గ్రంథాల బహుకరణ కార్యక్రమ ఆహ్వాన పత్రాన్ని ఆవిష్కరించిన న్యాయవాది బిరుదుల లక్ష్మణ్, ఈ కార్యక్రమంలో బీఎస్పీ జిల్లా అధ్యక్షుడు బొల్లంపల్లి సంపత్, న్యాయవాది గుడి కందుల మహేష్ అడ్వకేట్ సలీం, చిట్యాల నిఖిల్ , అంబేద్కర్ యూత్ క్లబ్ నామాపూర్ ప్రధాన కార్యదర్శి ఎలగందుల విష్ణు, ఆర్గనైజింగ్ సెక్రటరీ తూళ్ల మహేష్, ధర్మపురి డివిజన్ క్రిస్టియన్ పాస్టర్ ల అధ్యక్షుడు ఎలగందుల శ్రీనివాస్ లు,తదితరులు పాల్గొన్నారు.

# ఎస్సీ సెల్ ప్రెసిడెంట్ ఆధ్వర్యంలో జన్మదిన వేడుకలు



తరంగాలు, చొప్పదండి. నవంబర్ 19 : ఎస్సీసెల్ ప్రెసిడెంట్ పాలూరి ప్రసాద్ ఆధ్వర్యంలో ఎస్సీ సెల్ ప్రధాన కార్యదర్శి ఏలుగు రాజేందర్ జన్మదిన వేడుకలు జరిగాయి. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు మాజీ కౌన్సిలర్ కొట్టే అశోక్ ఎండి జాంగిర్ యామ తిరుపతి చుక్కల లక్ష్మణ్ రాజకుమార్ పోగుల రమేష్ రవి లంక రవి మన్మోహన్ కుమార్ కల్లేపల్లి శంకర్ భీమన్న మల్లే ష్ తదితరులు పాల్గొన్నారు

# పారిశుద్ధ కార్మికుల నిరసనతో, దిగివచ్చిన మున్సిపల్ కమిషనర్



తరంగాలు, పటాన్చెరు: జిన్నారం మున్సిపల్ లో, పారిశుద్ధ కార్మికుల వేతనాలు చెల్లించడం లేదని రెండు రోజులుగా పా రిశుద్ధ కార్మికులు నిరసన చేపట్టారు దిగివచ్చిన మున్సిపల్ కమిషనర్ తిరుపతి, పరిశుద్ధ కార్మికుల సమస్యలపై సుదీర్ఘంగా చర్చించి వాళ్లకు రావాల్సిన వేతనాలను గ్రామపంచాయతీ ఉన్నప్పటినుండి ఇప్పటివరకు కొన్ని నెలలుగా ఉన్న పెండింగ్ వేతనాలలో రెండు నెలల వేతనాలను పారిశుధ్య కార్మికులకు సమకూర్చారు. మిగతా వేతనాలను త్వరలో సమకూర్చే విధంగా ఏర్పాటు చేస్తామని హామీ హామీ ఇచ్చారు. దీంతో సమస్యలు పరిష్కరించినందుకు జిన్నారం మున్సిపల్ పరిశుద్ధ కార్మికులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సిఐటీయు నాయకులు నాగేశ్వరరావు మాజీ ఎంపీటీసీ పుట్టి భాస్కర్ యనగండ్ల నరేందర్ పరిశుద్ధ కార్మికులు పాల్గొన్నారు

# ఉపాధ్యాయ వృత్తి ఎంతో అత్యున్నతమైనది





తరంగాలు, చొప్పదండి. నవంబర్ 19: చొప్పదండి మండలంలోని జెడ్ పి హెచ్ ఎస్ రుక్మాపూర్ పాఠశాలలో స్వయం పరిపాలన దినోత్సవం ఘనంగా నిర్వహించారు .ఇట్టి సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు తుమ్మనపల్లి విద్యాసాగర్ రావు మాట్లాడుతూ జవహర్లాల్ నెహ్రూ జన్మదిన సందర్భంగా బాలల దినోత్సవాన్ని జరుపుకుంటున్నామని తెలియజేశారు. పండిత జవహర్లాల్ నెహ్రూ కి చిన్నపిల్లలంటే ఇష్టమని అందుకే ఆయన పుట్టినరోజు బాలల దినోత్సవం గా అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో కళాశాలలో జరుపుకుంటారని తెలియజేశారు. పండిత జవహర్లాల్ నెహ్రూ స్వాతంత్ర సమరయోధులు అని మొట్టమొదటి భారత దేశ ప్రధానమంత్రి అని కొనియాడారు. పంచవర్ష ప్రణాళికల ద్వారా దేశ అభివృద్ధికి కృషి చేశారని తెలియజేశారు. ఇట్టి సందర్భంగా ఉపాధ్యాయులుగా మారి పాఠాలు బోధించిన విద్యార్థిని విద్యార్థులను అభినందిస్తూ బహుమతి ప్రధానం చేశారు. నేటి బాలురే రేపటి పౌరులని క్రమశిక్షణతో కూడిన విద్య బోధనను అభ్యసించాలని విద్యార్థులను కోరారు. ఇట్టి కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు తుమ్మనపల్లి విద్యాసాగర్ రావు, ఉపాధ్యాయులు పసుపు నూరి శ్రీధర్ సముద్రాల అంజయ్య, గట్టు శ్రీ వాణి సంగనభట్ల సురేందర్ మాధవరపు శారద సుంకె ఉమాదేవి, బండ పెల్లి మల్లికార్జున్ జూనియర్ అసిస్టెంట్ ఉదయ్ కుమార్ విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

# పేదల జీవితాల్లో వెలుగులు నింపిన మహనీయురాలు ఇందిరా గాంధీ

## - మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు సింగిరెడ్డి నరేష్ రెడ్డి



భీమారం మండలం, నవంబర్ 19, తరంగాలు : రాష్ట్ర ప్రభుత్వ విప్,వేములవాడ శాసనసభ్యులు ఆది శ్రీనివాస్ ఆదేశాల మేరకు భీమారం మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు సింగిరెడ్డి నరేష్ రెడ్డి ఆద్వర్యంలో ఘనంగా ఇందిరాగాంధీ జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు..ఈ సందర్భంగా ఇందిరా గాంధీ చిత్రపటానికి పూలమాలలు నివాళులు అర్పించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. లిదేశం కోసం తన జీవితాన్ని అంకితం చేసిన గొప్ప నాయకురాలు ఇందిరాగాంధీ అని, లిపేదల సంక్షేమం, జాతీయ సమైక్యత, దృఢమైన నాయకత్వంఇవి ఆమె పాలనకు ప్రతీకలనీ, భారతదేశ అభివృద్ధి, మహిళా సాధికారత, శాంతి – భద్రతల పరిరక్షణలో ఆమె చేసిన కృషి ఎల్లప్పుడూ చిరస్థాయిగా నిలుస్తాయనీ, లిమాజీ ప్రధాని ఇందిరాగాంధీ చూపిన ధైర్యం, సంకల్పం నేటి తరానికి స్ఫూర్తిదాయకంగా నిలుస్తాయనీ, "జాతీయ సమగ్రత, మహిళా సాధికారత, వ్యవసాయ మరియు పారిశ్రామిక రంగాల అభివృద్ధికి ఇందిరా గాంధీ చేసిన కృషి అపా-రము. దేశాన్ని బలపరిచే అనేక కీలక నిర్ణయాలు తీసుకొని భారత రాజకీయ చరిత్రలో అజరామరమైన ముద్ర వేశారు. ఆమె చూపిన ధైర్యం, సంకల్పం నేటి తరానికి స్ఫూర్తిదాయకం" అని అన్నారు. "ఇందిరా గాంధీ దేశం కోసం తన జీవితాన్ని అంకితం చేసిన అసాధారణ నాయకురాలు. పేదల సంక్షేమం, జాతీయ సమైక్యత, దృఢమైన నాయకత్వంఇవి ఆమె పాలనకు ప్రతీకలు. దేశాభివృద్ధి, మహిళా సాధికారత, శాంతి%–%భద్రతల పరిరక్షణలో ఆమె చేసిన కృషి ఎల్లప్పుడూ చిరస్థాయిగా నిలుస్తుంది. మనం నేడు ఆమె స్ఫూర్తిని స్మరించుకోవడం మాత్రమే కాదు, ప్రజాసేవ అనే మహెూన్నత విలువలను ఆచరణలో పెట్టే బాధ్యత కూడా మనపై ఉంది. కాంగ్రెస్ పార్టీ సిద్ధాంతాలు, ఇందిరమ్మ చూపిన మార్గంఇవి ప్రజల కోసం నిరంతరం పనిచేయడానికి మాకు శక్తినిస్తాయి" అని అన్నారు. "భారతదేశ రాజకీయ చరిత్రలో అద్భుతమైన నాయకత్వ గుణాలు ప్రదర్శించిన మహానాయకురాలు ఇందిరాగాంధీ దేశ అభివృద్ధి కోసం అనేక విప్లవాత్మక నిర్ణయాలు తీసుకున్నారు. దేశ ఆర్థిక స్వావలంబనకు దారితీసిన బ్యాంకుల జాతీయీకరణ, రైతాంగాన్ని బలోపేతం చేసిన హరిత విప్లవం, బంగ్లాదేశ్ విముక్తి యుద్ధంలో చూపిన ధైర్యసాహసాలు దేశాన్ని అంతర్జాతీయ వేదికపై శక్తివంతమైన దేశంగా నిలబెట్టాయి. ప్రజల సంక్షేమం కోసం జీవితాంతం అహర్నిశలు కృషి చేసిన ఆమె త్యాగస్ఫూర్తి యువతకు స్ఫూర్తిదాయకం" అని అన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ శాఖా అధ్యక్షుడు బక్కూరి నరేష్, జిల్లా నాయకులు నీరటి మల్లేశం, ఉరుమట్ల లక్ష్మన్, మైనార్టీ సెల్ అధ్యక్షుడు ఎండి సయ్యద్, అధికార ప్రతినిధి ఏనుగంటి హరీష్, సోషల్ మీడియా ఇంచార్జ్ భూరం అరుణ్, మార్కెట్ కమిటీ సభ్యులు పల్లి బీమయ్య, చెక్కపెల్లి శంకర్, చెక్కపెల్లి సంజీవ్, బొమ్మెన ప్రశాంత్, పెద్దిరెడ్డి స్వామి, పతి గౌడ్, ఉత్కం శంకర్ గౌడ్, హైమద్, నిజమొద్దిన్, తేలు లక్ష్మి నర్సయ్య(బాషా),పిడమల్ల గంగాధర్, గుగ్గిళ్ల గంగాధర్, వెంకటేష్,అడ్లగట్ట ప్రేమ్, అమిర్, హలీమ్, రెండ్ల మధు, బనుమూర్తి, ప్రజా ప్రతినిధులు కాంగ్రెస్ పార్టీ శ్రేణులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు

# సీనియర్ సిటిజన్స్ సంరక్షణ చట్టంపై సమగ్ర అవగాహన కలిగి ఉండాలి


## - అంతర్జాతీయ వయోవృద్ధుల దినోత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్యే,జిల్లా కలెక్టర్



జగిత్యాల, నవంబర్ 19, తరంగాలు : బుధవారం సమీకృత జిల్లా కలెక్టరేట్ లోని సమావేశ మందిరంలో జిల్లా సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన అంతర్జాతీయ వయో వృద్ధుల దినోత్సవంలోజగిత్యాల శాసనసభ్యులు సంజయ్ కుమార్ తో కలిసి జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్ కుమార్ మాట్లాడుతూ వయో వృద్ధుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని, వారికి అన్నివేళలా అందుబాటులో ఉంటానని ఎమ్మెల్యే తెలిపారు. అనంతరం జిల్లా కలెక్టర్ సత్యప్రసాద్ మాట్లాడుతూ కుటుంబంలోని పిల్లలు మంచి మార్గంలో నడిచేలా గైడ్ చేయడంలో వయోవృద్ధులు కీలక పాత్ర పోషిస్తారని అన్నారు. వయో వృద్ధులు తెలియజేసిన సమస్యలలో జిల్లా యంత్రాంగం పరిధిలోని సమస్యలను సంపూర్ణంగా పరిష్కరించేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటామనిజిల్లా కలెక్టర్ తెలిపారు. బ్యాంకు లలో వయో వృద్ధులకు ప్రత్యేక సౌకర్యాలు కల్పనకు చర్యలు తీసుకుంటామని అన్నారు. ఆర్.బి.ఐ నిబంధనలు ప్రకారం రుణాల జారీ అవకాశాలు పరిశీలిస్తామని తెలిపారు. వృద్ధులు తమ అనుభవాలను దృష్టిలో ఉంచుకుని జిల్లా యంత్రాంగం పనితీరు పట్ల ఏదైనా సలహాలు ఉంటే తెలియజేయాలని, వాటిని సానుకూల దృక్పథంతో తీసుకొని పాటించడం జరుగుతుందని కలెక్టర్ తెలిపారు. వయో వృద్ధులు ఆరోగ్యం పై శ్రద్ధ వహించాలని, నలుగురితో స్నేహ పూర్వకంగా ఉండాలని, వీలైనంత వరకు తమ పనులు తామే చేసుకోవాలని నవ్వుతూ ఉండాలని కలెక్టర్ కోరారు. సీనియర్ సిటిజన్స్ సంరక్షణ చట్టంపై అవగాహన కలిగి ఉండాలని అన్నారు. అంతకుముందు జిల్లా సీనియర్ సిటిజన్స్ ఆర్గనైజేషన్ ద్వారా గత సంవత్సరం నుండి ఇప్పటి వరకు నిర్వహించిన కార్యక్రమాల వివరాలను, వృద్ధులకు చట్టాలపై సంఘం అధ్యక్షులు, కార్యదర్శులు వివరించారు. ఈ సందర్భంగా కార్యక్రమంలో పాల్గొన్న వృద్ధులు చట్టాలలో చేయవలసిన మార్పులపై, సమస్యల పరిష్కారానికి తీసుకోవాల్సిన చర్యలపై తమ అభిప్రాయాలను సభా దృష్టికి తీసుకొని వచ్చారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ లు బి. ఎస్ లత, బి. రాజ గౌడ్, జిల్లా సంక్షేమ అధికారి బోనగిరి నరేష్, డి.ఆర్.డి.ఓ రఘువరన్, డిప్యూటీ డి ఏం ఎచ్ వో శ్రీనివాస్,వయోవృద్ధులు, వయో వృద్ధుల ఆశ్రమాలు నిర్వహించు నిర్వాహకులు తదితరులు పాల్గొన్నారు.

# భయపెట్టనున్న అల్లరి నరేశ్

## - హారర్ థ్రిల్లర్‌కు సెన్సార్ క్లియర్




విలక్షణ నటుడు అల్లరి నరేశ్ ప్రధాన పాత్రలో నటిస్తున్న హారర్ థ్రిల్లర్ '12%ూ% రైల్వే కాలనీ' విడుదలకు సిద్ధమైంది. ఈ చిత్రం తాజాగా సెన్సార్ కార్యక్రమాలను పూర్తి చేసుకుని యు/ఏ సర్టిఫికెట్‌ను పొందింది. ఈ విషయాన్ని చిత్ర నిర్మాణ సంస్థ శ్రీనివాసా సిల్వర్ స్క్రీన్ అధికారికంగా ప్రకటించింది. అనేక మలుపులతో కూడిన ఈ థ్రిల్లర్‌ను ఆస్వాదించడానికి సిద్ధంగా ఉండాలని ప్రేక్షకులకు సూచించింది. ఈ సినిమాకు 'పొలిమేర', 'పొలిమేర 2' చిత్రాలతో ప్రసిద్ధి చెందిన డా. అనిల్ విశ్వనాథ్ కథ, స్క్రీన్‌ప్లే, సంభాషణలు అందించడంతో పాటు షోరన్నర్‌గా కూడా వ్యవహరించారు. నాని కాసరడ్డ ఈ చిత్రంతో దర్శకుడిగా పరిచయమవుతున్నారు. దర్శకత్వంతో పాటు ఎడిటింగ్ బాధ్యతలను కూడా ఆయనే నిర్వర్తిస్తున్నారు. శ్రీనివాసా చిట్టూరి నిర్మిస్తున్న ఈ చిత్రాన్ని పవన్ కుమార్ సమర్పిస్తున్నారు. ఇప్పటికే విడుదలైన టైటిల్ టీజర్ సినిమాపై ఆసక్తిని పెంచింది. ఇందులో అల్లరి నరేశ్ ఎంతో సీరియస్ పాత్రలో కనిపించారు. టీజర్‌లో దెయ్యాలు కొందరికే ఎందుకు కనిపిస్తాయంటూ వినపడే వాయిస్ ఓవర్, ఉత్కంఠభరితమైన సన్నివేశాలు సినిమా నేపథ్యాన్ని తెలియజేశాయి. చివర్లో అల్లరి నరేశ్ ఒకరిని కాల్చి చిరునవ్వుతో కనిపించడం ప్రేక్షకులలో క్యూరియాసిటీని పెంచింది. ఈ చిత్రంలో 'పొలిమేర' ఫేమ్ డా. కామాక్షి భాస్కర్ల కథానాయికగా నటిస్తుండగా, సాయి కుమార్, వైవా హర్ష, గెటప్ శ్రీను, సద్దాం తదితరులు కీలక పాత్రలు పోషిస్తున్నారు. భీమ్స్ సిసిరోలియో సంగీతం అందించిన ఈ సినిమా, నవంబర్ 21న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలోకి రానుంది.




# వైజాగ్‌లో 'అఖండ 2' సందడి.. 'జాజికాయ' పాట విడుదల

నందమూరి బాలకృష్ణ, బోయపాటి శ్రీను కలయికలో రూపొందుతున్న పాన్ ఇండియా చిత్రం 'అఖండ 2: తాండవం'. ఈ చిత్రం డిసెంబర్ 5న ప్రేక్షకుల ముందుకు రానుంది. ప్రచార కార్యక్రమాల్లో భాగంగా నిన్న వైజాగ్‌లో చిత్రంలోని "జాజికాయ జాజికాయ" అనే పాటను విడుదల చేశారు. ఈ చిత్రంలో బాలకృష్ణ సరసన సంయుక్తా మేనన్ నటిస్తుండగా, రామ్ ఆచంట, గోపీ ఆచంట నిర్మిస్తున్నారు. ఈ సందర్భంగా బాలకృష్ణ మాట్లాడుతూ.. "నాది, బోయపాటిది సినిమా వస్తుందంటేనే ఇంట గెలిచినట్లు. ఇప్పుడు 'అఖండ 2'తో రచ్చ గెలవడానికి సిద్ధమవుతున్నాం. ఇప్పటికే 'అఖండ తాండవం' పాటతో హిందీ ప్రేక్షకులకు మా తొలి దెబ్బ రుచి చూపించాం. ఇప్పుడు విడుదల చేసిన 'జాజికాయ' పాట ఐటెం సాంగ్ కాదు, కుటుంబ పండగలో వచ్చే గీతం," అని స్పష్టం చేశారు. "సనాతన హిందూ ధర్మం మన జాతి మూలం. ఆ ధర్మం చెప్పే శక్తిని, పరాక్రమాన్ని, గౌరవాన్ని ఈ సినిమాలో చూస్తారు," అని బాలకృష్ణ ఉద్ఘాటించారు. దర్శకుడు బోయపాటి శ్రీను మాట్లాడుతూ.. "ఈ చిత్రంలో ఉన్న ఏకైక మాస్ పాట 'జాజికాయ'. ఇది పుట్టినరోజు వేడుక నేపథ్యంలో వస్తుంది. ఈ పాటలో బాలకృష్ణను మరో కోణంలో చూస్తారు," అని తెలిపారు. కథానాయిక సంయుక్తా మేనన్ మాట్లాడుతూ.. బాలయ్య-బోయపాటి కలయిక అనగానే మరో ఆలోచన లేకుండా సినిమా ఒప్పుకున్నానని, తన పాత్రలో కొన్ని సస్పెన్స్ అంశాలు ఉంటాయని అన్నారు. ఈ చిత్రంలో ఆది పినిశెట్టి, జగపతిబాబు కీలక పాత్రలు పోషిస్తున్నారు. తమన్ సంగీతం అందిస్తున్నారు.

## ధనుష్ మేనేజర్ శ్రేయాస్‌పై నటి మాన్య కాస్టింగ్ కౌచ్ ఆరోపణలు

కోలీవుడ్ స్టార్ హీరో ధనుష్ పేరు మరోసారి వార్తల్లోకెక్కింది. ఈసారి ఆయన మేనేజర్ శ్రేయాస్ వ్యవహారం వివాదాస్పదంగా మారింది. ప్రముఖ తమిళ టీవీ నటి మాన్య ఆనంద్, శ్రేయాస్‌పై లైంగిక వేధింపుల ఆరోపణలు చేశారు. ఓ కొత్త సినిమా అవకాశం కోసం ఆయన తనను "కమిట్‌మెంట్" అడిగాడని ఆమె ఓ ఇంటర్వ్యూలో సంచలన ఆరోపణలు చేశారు. మాన్య తన ఇంటర్వ్యూలో మాట్లాడుతూ.. "ధనుష్ మేనేజర్ శ్రేయాస్ ఓ కొత్త సినిమా కోసం నన్ను సంప్రదించారు. సినిమాకు కమిట్‌మెంట్ ఇవ్వాలని అడిగారు. ఎలాంటి కమిట్‌మెంట్ అని నేను ప్రశ్నించాను. సినిమా కోసం అలాంటి షరతులు అంగీకరించేందుకు నేను సిద్ధంగా లేనని చెప్పాను. అప్పుడు అతను, 'ధనుష్ సర్ అయినా ఒప్పుకోరా?' అని అడిగాడు" అని వివరించారు. మాన్య ఆరోపిస్తూ, తాను తిరస్కరించినా శ్రేయాస్ చాలాసార్లు ఫోన్ చేసి, ధనుష్ నిర్మాణ సంస్థ వుండర్‌బార్ ఫిల్మ్స్ లొకేషన్‌కు పంపాడని, స్క్రిప్ట్ చదవాలని ఒత్తిడి చేశాడని చెప్పారు. "వేము నటులం, నటించడం మా పని. అవకాశాలు ఇవ్వండి కానీ ప్రతిఫలంగా ఏమీ ఆశించవద్దు. ఇండస్ట్రీలో ఈ పద్ధతికి ముగింపు పలకాలి" అని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. ఇదే సినిమా కోసం మరో మేనేజర్ కూడా తనను ఇలాగే సంప్రదించాడని ఆమె వెల్లడించారు. 'వనత్తై పోలా' అనే తమిళ టీవీ సీరియల్‌తో మాన్య ఆనంద్ బాగా ప్రాచుర్యం పొందారు. ప్రస్తుతం ఆమె చేసిన ఆరోపణలతో కూడిన ఇంటర్వ్యూ సామాజిక మాధ్యమాల్లో వైరల్ అవుతోంది.



# నాకు డబ్బులు ముఖ్యం కాదు – దీపికా పదుకొణె

బాలీవుడ్ అగ్రనటి దీపికా పదుకొణె ఇటీవల రెండు భారీ పాన్ ఇండియా ప్రాజెక్టులను తిరస్కరించడంపై స్పష్టత ఇచ్చారు. ప్రభాస్ హీరోగా రానున్న 'కల్కి' సీక్వెల్, సందీప్ రెడ్డి వంగా దర్శకత్వంలోని 'స్పిరిట్' సినిమాల్లో నటించకపోవడానికి కారణం పారితోషికం లేదా డేట్స్ కాదని, ఆరోగ్యకరమైన పని వాతావరణానికే తన తొలి ప్రాధాన్యత అని ఆమె వెల్లడించారు. ఇటీవల ఓ ఇంటర్వ్యూలో మాట్లాడుతూ, తన నిర్ణయంపై వస్తున్న విమర్శలకు దీపికా సమాధానమిచ్చారు. "సినిమా బడ్జెట్ రూ.100 కోట్లా లేక రూ.500-600 కోట్లా అనేది నా నిర్ణయాలపై ప్రభావం చూపదు. కొందరు భారీ పారితోషికం ఆఫర్ చేస్తారు. కానీ నాకు అది ముఖ్యం కాదు" అని ఆమె తెలిపారు. సినిమా స్థాయిని బట్టి తన ప్రాధాన్యతలు మారవని ఆమె పరోక్షంగా వెల్లడించారు. ఆరోగ్యకరమైన పని వాతావరణం ఉన్నప్పుడే ఉత్తమమైన నటనను ఇవ్వగలమని దీపిక పేర్కొన్నారు. "ప్రతిరోజూ ఎనిమిది గంటల పనివేళలు సరిపోతాయి. మనం ఆరోగ్యంగా ఉన్నప్పుడే మన పనిలో అత్యుత్తమ ప్రదర్శన ఇవ్వగలం" అని ఆమె వివరించారు. ఆమె వ్యాఖ్యలు ప్ర న - ్తతం సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. కాగా, దీపికా పదుకొణె ఇ టీ వ లే ప్రభాస్ 'కల్కి 2898 ఏడీ'లో కీలక పాత్రలో కనిపించారు. ప్రస్తుతం ఆమె అల్లు అర్జున్, అట్లీ దర్శకత్వంలో రూపొందుతున్న భారీ పాన్ ఇండియా చిత్రంలో కథానాయికగా నటిస్తున్నారు.

# ఓ నటుడిగా, ప్రేక్షకుడిగా నాకు అలాంటి కథలంటే ఇష్టం

## - నాగచైతన్య



ప్రేమకథలంటే తనకు ఎంతో ఇష్టమని, ఇటువంటి చిత్రాలకు ప్రేక్షకుల ఆదరణ ఎల్లప్పుడూ ఉంటుందని యువ హీరో నాగచైతన్య అన్నారు. కొవిడ్ సమయంలో యాక్షన్, విజువల్ ఎఫెక్ట్స్ ఉన్న చిత్రాలకే ప్రేక్షకులు థియేటర్లకు వస్తారని, ప్రేమకథలను చూడరని కొందరు భయపెట్టారని, కానీ అది నిజం కాదని నిరూపితమైందని ఆయన స్పష్టం చేశారు. ప్రియదర్శి, ఆనంది జంటగా నవనీత్ శ్రీరామ్ దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'ప్రేమంటే'. ఈ చిత్రం నవంబర్ 21న విడుదల కానున్న సందర్భంగా హైదరాబాద్‌లో ప్రీ రిలీజ్ ఈవెంట్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన నాగచైతన్య మాట్లాడుతూ నటుడిగా, ప్రేక్షకుడిగా లవ్ స్టోరీస్ అంటే చాలా ఇష్టమని పేర్కొన్నారు. ఈ జానర్ చిత్రాలను ప్రేక్షకులు ఆదరిస్తారని మరోసారి రుజువైందని అన్నారు. నటుడు ప్రియదర్శిపై చైతన్య ప్రశంసలు కురిపించారు. ప్రియదర్శికి చిన్న సినిమా, పెద్ద సినిమా, కామెడీ, యాక్షన్, హీరో, క్యారెక్టర్ ఆర్టిస్ట్ వంటి తేడాలేవీ తెలియవని, ఎలాంటి పాత్రలోనైనా ఒదిగిపోయే విలక్షణ నటుడు అని కొనియాడారు. 'కస్టడీ' చిత్రంలో ఆనందితో కలిసి పనిచేయడం సంతోషంగా ఉందని గుర్తుచేసుకున్నారు. ఈ కార్యక్రమంలో దర్శకుడు శేఖర్ కమ్ముల, నిర్మాత సురేశ్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

Printed,Published by,Owened by GADDAM NAGARAJU & Printed at ,arun publication ,HNO 51/1 indhiramma colony,phase 1,nizampet, Hyderabad RNI. NO TELTEL/2022/83463 & Published at .HNO 3-123shivanagar colony,Ellanda, Wardhannapet, warangal 506313.. telangana
EDITOR : GADDAM NAGARAJU . CELL :9494923460 . Website : WWW.tharangalu.com Email : nagarajugaddam009@gmail.com